



పీలేరులో విలేఖరులతో మాట్లాడుతున్న నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

## తప్పు చేయించిన వారినీ శిక్షించాలి

- మంత్రి పెద్దిరెడ్డి, ఆయన తనయుడిని ఎన్నికల నుంచి బహిష్కరించాలి
- ఎంపీ గురుమూర్తిని అనర్హుడిగా ప్రకటించాలి
- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

పీలేరు, జనవరి 19: తప్పు చేసిన అధికారులనే కాకుండా వారితో ఆ తప్పు చేయించిన వారిని కూడా శిక్షించాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. కలెక్టర్ పీఎస్ గిరీషా సస్పెన్షన్ నేపథ్యంలో శుక్రవారం ఆయన పీలేరులో విలేఖరులతో మాట్లాడారు. తిరుపతి ఉప ఎన్నికల్లో అనేక అక్రమాలు జరిగాయని, తాము ఆ ఎన్నికకు నాలుగు రోజుల ముందే చెప్పామని, ఆనాడు ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఆ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న తలంపుతో రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన తనయుడు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పర్యవేక్షణలో తిరుపతి లోకసభ సెగ్మెంట్ పరిధిలోని వైసీపీ ప్రజాప్రతినిధులు మూకుమ్మడిగా ఓటరు అక్రమాలకు పాల్పడ్డారన్నారు. తిరుపతి, తిరుమల, శ్రీకాళహస్తికి తీర్థయాత్రలకు వచ్చామని అబద్ధాలు చెప్పి దొంగ ఓట్లు వేస్తూ పుంగనూరు నియోజకవర్గానికి చెందిన వేలాది మంది వైసీపీ సానుభూతిపరులు అడ్డంగా దొరికిపోయారన్నారు. తిరుపతి ఉప ఎన్నిక పోలింగ్ రోజున రాష్ట్రంలోని అన్ని ప్రసార మాధ్యమాలు ఆ దురాగతాలను ప్రసారం చేశాయని గుర్తు చేశారు. అప్పట్లోనే చర్యలు తీసుకోకుండా ఎన్నిక జరిగిన మూడేళ్లకు కేంద్ర ఎన్నికల సంఘం చర్యలకు ఉపక్రమించిందన్నారు. ఆలస్యమైనప్పటికీ కేంద్ర ఎన్నికల సంఘం చర్యలను స్వాగతిస్తున్నామన్నారు. ఆ రోజున ఎన్నికల విధుల్లో ఉన్న అధికారుల అధికారిక లాగిన్‌ల ద్వారా దొంగ ఓట్ల నమోదు, ఓటరు ఐడీ కార్డుల చోరీ, దొంగ ఐడీ కార్డుల తయారీ జరుగుతోందని తాను, తమ నేతలు చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్ చెబుతున్నా అప్పటి అధికారులు పట్టించుకోలేదన్నారు. అయితే కేవలం అధికారులను శిక్షించడంతోనే సరిపుచ్చడం మంచిది కాదని, అధికారులతో ఆ తప్పులు చేయించిన వారిని కూడా శిక్షించినప్పుడే సామాన్య ప్రజలకు రాజ్యాంగ సంస్థలపై నమ్మకం కుదురుతుందన్నారు. అధికార మదంతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, తిరుపతికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు ఆ ఎన్నిక కోసం అధికారుల లాగిన్‌ను దుర్వినియోగ పరిచారని ఆరోపించారు. పవిత్రమైన ఎన్నికల వ్యవహారాన్ని అభాసుపాలు చేసిన వైసీపీ నాయకులందరినీ ఎన్నికల ప్రక్రియలో పాల్గొనకుండా శాశ్వతంగా బహిష్కరించాలని ఆయన కోరారు. అంతేకాకుండా దొంగ ఓట్లతో ఎన్నికైన తిరుపతి ఎంపీ గురుమూర్తిని అనర్హుడిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సాక్షాత్తు ఈఆర్‌వో లాగిన్ నుంచి సుమారు 30 వేల ఓటరు ఐడీలు అనధికారికంగా డౌన్‌లోడ్ అయ్యాయని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన తరువాత ఆ ఓట్లతో గెలిచిన ఎంపీ ఆ పదవిలో కొనసాగడం అనైతికమన్నారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులుందరూ కలెక్టర్ గిరీషా ఉదంతాన్ని గుణపాఠంలా తీసుకోవాలని, తప్పులు చేయించే అధికార పార్టీ నాయకులు ఆపద సమయంలో ఆదుకోరనే విషయం గుర్తించాలని తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ నెల 24న పీలేరులో చంద్రబాబు పాల్గొననున్న 'రా...కదిలిరా' బహిరంగ సభను విజయవంతం చేయాలని రాజంపేట పార్లమెంటు సెగ్మెంటు పరిధిలోని ప్రజలకు కిశోర్ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో టీడీపీ నాయకులు మల్లారపు రవిప్రకాశ్‌నాయుడు, మద్దిపట్ల సూర్యప్రకాశ్, శ్రీకాంత్‌రెడ్డి, అమరనాథరెడ్డి, రహంతుల్లా, రియాజ్, చిన్నా, షౌకత్‌అలీ, పురం రామ్మూర్తి, పోలిశెట్టి సురేంద్ర, లక్ష్మీకర, ముబారక్, గాండ్ల విజయకుమార్, గిరినాయుడు, నారే సతీశ్, మునాఫ్, తదితరులు పాల్గొన్నారు.

# రండి బాబూ.. రండి.. హోల్‌సేల్ ధరలకే

# ప్రభుత్వ స్థలాలు !

రండి బాబూ రండి.. త్వరపడండి.. ఆలస్యం చేస్తే ఆశా భంగం. చాలా అగ్గవ.. అగ్గవ.. ఎవరు ముందొస్తే వారికే. తక్కువ రేటుకే.. ఎక్కువ లాభం. సాధారణంగా ఇలాంటి వ్యాఖ్యలు మనం సంతలోనో, వ్యాపారస్తుల నోటా వింటూ ఉంటాం. కానీ ఓ రెవెన్యూ అధికారి దీన్ని బాగా వంటబట్టించుకున్నట్లున్నాడు. రూ.50 వేలు ఇవ్వండి.. పొజిషన్ సర్టిఫికెట్ పొందండి. రూ.లక్ష కొట్టండి.. విలువైన స్థలం సొంతం చేసుకోండి.. రూ.10 వేలు ఇవ్వండి.. ఈబీసీ సర్టిఫికెట్ తీసుకోండి అంటూ.. ఒక్కోదానికి ఒక్కో రేటు నిర్ణయించి సంతలో కూరగాయలు అమ్మినట్లు అమ్మేస్తున్నాడు. అసలు ప్రభుత్వ స్థలానికే పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చేశాడంటే.. ఈయన ఎంత ఘనుడో అర్థం చేసుకోవచ్చు.



గాలివీడు తహసీల్దారు కార్యాలయం




- క్రయ, విక్రయాలు.. రియల్టర్లు, రెవెన్యూ అధికారి చేతుల్లోనే
- ఒక్కో ప్లాటు రూ.40 వేల నుంచి రూ.2 లక్షలు
- హౌసింగ్ కార్యాలయ స్థలానికీ పొజిషన్ సర్టిఫికెట్
- చుక్కల భూముల రైతులకు చుక్కలు..
- ఇలాంటి అధికారిని చూడలేదంటున్న రైతులు



గృహ నిర్మాణశాఖ కార్యాలయ ఆవరణంలో నిర్మాణానికి చదును చేసిన స్థలం

గాలివీడు, జనవరి 19: మండల కేంద్రంలో భూములకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఇది ప్రభుత్వ భూమి.. ప్రైవేటు భూమి అనేది చూడకుండా కొందరు రియల్టర్లు రూ.లక్షలు పెట్టి కొనుగోలు చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు.. ఇదే అదునుగా చూసుకున్నట్లున్నారో.. ఏమో ? భూములు, స్థలాల విలువను దృష్టిలో ఉంచుకొని, ఇంటి స్థలాలను, ప్రభుత్వ భూములను బేరం పెట్టేశారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇందుకు ఉదాహరణగా గృహ నిర్మాణశాఖ కార్యాలయం ఆవరణంలోనే ఇంటి నిర్మాణం కోసం పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చారంటే రెవెన్యూ అధికారుల బరితెగింపు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మండలంలో ఇలాంటివి ఎన్నో జరిగాయని ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు సమీపంలో ఉన్న ఆర్అర్ కళాశాలకు వెళ్లేదారిలో హౌసింగ్ కార్యాలయం ఉంది. అప్పటి కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో సర్వే నెంబరు 900 బీలో 5 సెంట్ల స్థలాన్ని గృహ నిర్మాణ కార్యాలయానికి కేటాయించారు. ఇందులో ఒకటిన్నర సెంటు స్థలంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేయగా, మిగిలిన స్థలం ఖాళీగా ఉన్నది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో స్థలం విలువ ఒక మూర రూ.లక్షకు పైగా పలుకుతోంది. ఇలాంటి స్థలానికే ఈ నెల 8వ తేదీన రెవెన్యూ అధికారులు ఇంటి నిర్మాణం చేసుకునేందుకు పొజిషన్ సర్టిఫికెట్ జారీ చేసినట్లు సమాచారం. పొజిషన్ సర్టిఫికెట్ ఏ స్థలానికి జారీ చేశారో కానీ సర్టిఫికెట్ పొందిన సదరు వ్యక్తి పండుగ సెలవుల్లో హౌసింగ్ కార్యాలయ ఆవరణంలో ఎక్సకవేటర్లతో చదును చేశారు. ఈ విషయం తెలుసుకున్న హౌసింగ్ అధికారులు అక్కడికి చేరుకొని చదును చేస్తున్న ఎక్సకవేటర్‌ను అడ్డుకొని అక్కడి నుంచి పంపినట్లు తెలిసింది. కానీ ఈ నెల 17న సదరు పొజిషన్ సర్టిఫికెట్ పొందిన వ్యక్తి తిరిగి అదే స్థలంలో గునాది రాళ్లను తీసుకురాగా, తామందరం బతిమలాడుకొని అక్కడి నుంచి పంపించామని హౌసింగ్ సిబ్బంది చెబుతున్నారు. ఇదిలా ఉండగా... ఈ స్థలంపై ఇంటి నిర్మాణానికి సంబంధించి రెవెన్యూ అధికారులు తనకు పొజిషన్ సర్టిఫికెట్ జారీ చేశారని, ఈ స్థలం తనదేనని, తనకు పూర్తి హక్కు ఉన్నదని సదరు వ్యక్తి చెబుతున్నట్లు తెలుస్తోంది. కానీ పొజిషన్ సర్టిఫికెట్ మాత్రం చూపించలేదని రెవెన్యూ వారు అంటున్నారు. అయితే ఇంత జరుగుతున్నా ఆ స్థలంపై రెవెన్యూ అధికారులు మాత్రం కన్నెత్తి చూడకపోవడంపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయ స్థలంలోనే.. ఇంటి నిర్మాణానికి పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చిన వారు.. ఇంక మిగతా ప్రభుత్వ స్థలాలకు ఏ మేరకు రక్షణ ఉంటుందోనని పలువురు చర్చించుకుంటున్నారు. ఈ స్థలంలో పొజిషన్ సర్టిఫికెట్ పొందేందుకు రూ.లక్షకు పైగా చేతులు మారినట్లు సమాచారం.

### చుక్కల భూముల్లో భారీ వసూళ్లు

మండలంలో ప్రతి గ్రామంలో చుక్కల పట్టా భూములు ఉన్నాయి. చుక్కల భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించేందుకు కానీ, వాటిని అమ్మేందుకు కానీ రైతులకు వీలు ఉండదు. అయితే ఇటీవల చుక్కల పట్టా భూములకు ఆన్‌లైన్ చేసుకోవడానికి ప్రభుత్వం వీలు కల్పించారు. ఇదే వారికి కాసుల పంటగా మారింది. రైతుల దగ్గర నుంచి వసూళ్ల పర్వానికి తెరలేపినట్లు పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. భూముల విలువను బట్టి రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు వసూలు చేసినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రం సమీపంలోని 3 ఎకరాల భూమిని ఆన్‌లైన్ చేసేందుకు, ఎకరాకు రెండు సెంట్లు చొప్పున మొత్తం 6 సెంట్లు అడిగినట్లు సమాచారం. అదేవిధంగా నూలివీడు పంచాయతీలో 25 సెంట్ల అసైన్‌మెంట్ భూమికి రూ.40 వేలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు కలవు. ఇదే భూమికి మరో వ్యక్తి ఎక్కువ మొత్తంలో ఆశ చూపి.. పట్టా చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. గతంలో ఎంతో మంది రెవెన్యూ అధికారులు ఇక్కడ పనిచేశారు కానీ.. ఇలాంటి వారిని తామెప్పుడూ చూడలేదని, ప్రస్తుత అధికారులు విలువైన ప్రభుత్వ భూములన్నీ ధారాదత్తం చేస్తున్నట్లు మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.

**పొజిషన్ సర్టిఫికెట్‌ను రద్దు చేశాం..**

గతంలో ఓ వ్యక్తి పొజిషన్ సర్టిఫికెట్‌తో ఆ స్థలంలోకి వెళ్లాడు. కానీ ఆ సర్టిఫికెట్‌ను మేము రద్దు చేశాం. అలాగే ఎవరి దగ్గర చుక్కల భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించేందుకు బలవంతపు వసూళ్లకు పాల్పడలేదు.

- బాలాజీ, ఆర్ఐ

**ఫిర్యాదు చేస్తే పరిశీలిస్తా..**

హౌసింగ్ కార్యాలయ ఆవరణాన్ని ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకోవడం, అందులో ఇంటి నిర్మాణాన్ని చేపట్టబోతున్న విషయం నా దృష్టికి రాలేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే వెళ్లి పరిశీలిస్తా. ఆక్రమించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటా.

- దైవాదీనం, తహసీల్దార్

సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు మురళీధర్‌రెడ్డి



## రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితా అందించాలి

- ఎన్నికల పరిశీలకుడు మురళీధర్‌రెడ్డి

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 19: గుర్తింపు కలిగిన రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితా అందేలా తగిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల పరిశీలకుడు మురళీధర్‌రెడ్డి సూచించారు. జిల్లాకు ఓటర్ల జాబితా పరిశీలకుడిగా నియమింపబడిన మురళీధర్‌రెడ్డి ఐఏఎస్ శుక్రవారం స్థానిక రాయచోటి కలెక్టరేట్‌లో ముసాయిదా ఓటర్ల జాబితా 2024పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఓటర్ల జాబితాలో ఉన్న వివిధ అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో మొత్తం 1607 పోలింగ్ కేంద్రాలున్నాయని, ఒక్కో పోలింగ్ కేంద్రానికి సగటున 845 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. 2011 జనాభా ప్రకారం ఈపీ రేషియో 688 ఉందని, 2024 ముసాయిదా జాబితా ప్రకారం జనవరి 12 నాటికి ఈపీ రేషియో 690 ఉన్నట్లుగా తెలిపారు. స్త్రీ, పురుష నిష్పత్తి, జిల్లాలో 1035 ఉందని, రాజంపేటలో అత్యధికంగా 1050 ఉన్నట్లుగా తెలియజేశారు. 18-19 సంవత్సరాల వయసు గల ఓటర్లు దాదాపు 32 వేల మంది ఉన్నారన్నారు. సర్వీస్ ఓటర్ల గురించి వివరిస్తూ జిల్లాలో 1306 మంది సర్వీస్ ఉన్నట్లుగా తెలిపారు. అనంతరం ఎన్నికల పరిశీలకుడు మురళీధర్‌రెడ్డి ఐఏఎస్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా తయారీ సంతృప్తికరంగా ఉందని, ఎన్నికల సంఘం అనుమతి వచ్చిన తరువాత గుర్తింపు కలిగిన రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితా కాపీలను ఇచ్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డీఈవో సత్యనారాయణ, మదనపల్లె, రాయచోటి ఆర్డీవోలు మురళి, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల జాబితాను సమర్పించండి

- రాజకీయ పార్టీల ప్రతినిధులతో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 19: జిల్లాలో నియోజకవర్గాల వారీగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల జాబితాను సమర్పించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. శుక్రవారం సాయంత్రం స్థానిక రాయచోటిలోని కలెక్టరేట్‌లో ముసాయిదా ఓటర్ల జాబితా 2024 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, తదితర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఓటర్ల జాబితా 2024 ఈ నెల 22 నాటికి పూర్తవుతుందని, అనంతరం ఎన్నికల సంఘం అనుమతి తర్వాత గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితా అందిస్తామన్నారు. ఏమైనా ఫిర్యాదులు ఉంటే వెంటనే సమర్పించాలని రాజకీయ పార్టీలను కోరారు. సమావేశంలో డీఆర్‌వో సత్యనారాయణ, మదనపల్లె, రాయచోటి ఆర్డీవోలు మురళి, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

# బెదిరించినా.. తగ్గేదేలా..!

- అంబేడ్కర్ విగ్రహానికి వినతి
- హోరెత్తిన అంగన్వాడీల నిరసనలు



తంబళ్లపల్లెలో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): 'మా డిమాండ్లు పరిష్కరించే వరకు ఎన్ని బెదిరింపులకు పాల్పడినా తగ్గేదేలా' అంటూ అంగన్వాడీలు అంటున్నారు. 39 రోజులుగా నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వానికి చీమకు ట్టినట్లు కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పలుచోట్ల అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించా రు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రమైన కలెక్టర్ కార్యాలయం వద్ద ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియే షన్ ఏఐటీయూసీ అనుబంధం ఆధ్వర్యంలో 39వ రోజు వినూత్నంగా కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకొని అంగన్వాడీలు నిరసన తెలిపారు. రాజంపేట పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాల యం ఎదుట అంగన్వాడీలు ధర్నా చేశారు. అదేవిధంగా వాల్మీకిపురం ప్రాజెక్టు కార్యాల యం నుంచి అంగన్వాడీ కార్యకర్తలు ర్యాలీ చేపట్టి పురవీధుల గుండా నినాదాలతో హోరెత్తించారు. అనంతరం స్థానిక పాత బస్టాండులోని అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తంబళ్లపల్లెలో స్థానిక మూడు రోడ్ల కూడలిలో అంగన్వాడీలు బైఠాయించి నిరసన తెలిపారు.

వాల్మీకిపురంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీలు






రాజంపేట అంగన్‌వాడీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్యకర్తలు

# ఈసారి పులివెందుల టీడీపీదే

- జగన్‌ను ఇన్నిసార్లు గెలిపించాం.. మాకు ఒరగబెట్టిందేమిటి అంటూ..
- పులివెందుల వాసులు బాధపడుతున్నారు
- ఒక్కచాన్స్ అంటే అవకాశమిచ్చారు.. మీకేమైనా ఉద్యోగాలు వచ్చాయా
- మీ బతుకులు ఏమైనా బాగుపడ్డాయా
- స్టీలు ఫ్యాక్టరీ పూర్తి చేశారా... ఒక్క కాలువ తవ్వారా
- బాగుపడింది ఇద్దరే.. ఒకరు జగన్‌రెడ్డి, మరొకరు ఎంపీ రెడ్డి
- కమలాపురం సభలో సీఎం జగన్‌పై చంద్రబాబు నిప్పులు
- ఎమ్మెల్యేల అవినీతి అక్రమాలు పెరిగాయి
- కమలాపురం సభ సక్సెస్



కమలాపురం సభకు భారీగా హాజరైన జనసందోహం, (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

కడప, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): "ఒక్క చాన్స్ అంటూ మీ ముందుకు వచ్చారు. మనవాడే కదా అంటూ 2019 ఎన్నికల్లో కడపలో అన్ని సీట్లు గెలిపించారు. ఇప్పటికీ మీ పరిస్థితి ఏమైనా మారిందా.. మీకు ఉద్యోగాలు వచ్చాయా.. రైతుల జీవితంలో మార్పు వచ్చిందా.. కడపలో ఎవరికైనా న్యాయం జరిగిందా.. ఒకరు జగన్‌మోహన్ రెడ్డికి రెండు మీ ఎంపీ రెడ్డికి న్యాయం జరిగింది. అవునా, కాదా.. ఒక సాగునీటివ ప్రాజెక్టు అయినా తెచ్చారా... కడపకు స్టీలు ఫ్యాక్టరీ వచ్చిందా.. రైతులకు డ్రిప్ ఇచ్చాడా.. ఇవ్వలేదు. మాటలు కోటలు దాటుతాయి. చేతలు మాత్రం గడప దాటవు.. అదీ జగన్ మోహన్‌రెడ్డి నైజం. తమ్ముళ్లూ కమలాపురం సాక్షిగా మిమ్మల్ని అడుగుతున్నా.. ఈ జనసందోహం ఉందంటే ఇక ఏ మాత్రం అనుమానమే లేదు. ఈసారి పులివెందుల టీడీపీదే" అంటూ టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు చెప్పారు.

రా..కదలిరా.. పేరిట శుక్రవారం సాయంత్రం కమలాపురంలో నిర్వహించిన బహిరంగసభలో చంద్రబాబు మాట్లాడుతూ "కరువుతో కడప జిల్లా తీవ్రంగా నష్టపోయింది. కరువు పరిస్థితిని సీఎం జగన్‌కు అధికారులు వివరిస్తే నా జిల్లాలో కరువేంటి అంటూ ఫైలును అధికారుల ముఖాన కొట్టడంతో అధికారులు చిన్నబుచ్చుకుని వెనుదిరిగారు. పులివెందులలో ఇన్ని సార్లు గెలిపించాం, మాకు ఒరగబెట్టిందేమీ లేదని అంటున్నారు.. రాష్ట్రమంతా ఇలాంటి సీఎం మాకొద్దంటుంటే మేం పులివెందులలో గెలిపించామా అని బాధపడుతున్నారు. సొంత జిల్లాలోనే కరువు ప్రకటించకపోవడాన్ని రైతులు జీర్ణించుకోలేకోతున్నారు. నేను సీఎం అయింటే కేంద్రాన్ని ఒప్పించి కరువు రైతులను ఆదుకునేవాడిని" అని చంద్రబాబు అన్నారు.

### స్టీలు ఫ్యాక్టరీ పూర్తి చేశారా..

ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రెండు సార్లు స్టీలు ఫ్యాక్టరీకి శంకుస్థాపనలు చేసి ఫోజులు కొట్టారు. తరువాత ఏమీ లేదు. మీ జీవితాలు బాగుపడ్డాయా.. ఒక్కరికైనా ఉద్యోగం వచ్చిందా.. ఒక్క ప్రాజెక్టు పూర్తి చేశారా.. కనీసం పిల్ల కాల్వ అయినా తవ్వారా అంటూ చంద్రబాబు ప్రశ్నించారు. జిల్లాలో బాగుపడింది జగన్‌రెడ్డి అయితే రాష్ట్రంలో బాగుపడింది పెద్దిరెడ్డి, సజ్జలరెడ్డి, సుబ్బారెడ్డి, సాయిరెడ్డి మాత్రమే అన్నారు. పట్టిసీమ పూర్తి చేశాం. 120 టీఎంసీల నీటిని సీమకిచ్చాం. రాయలసీమలో అవుకు టన్నెల్ పూర్తి చేసి పులివెందులకు నీళ్లిచ్చి ఎండుతున్న పంటలు కాపాడాం. టీడీపీ హయాంలో సీమ ప్రాజెక్టుల కోసం రూ.20వేలకోట్లు ఖర్చు పెడితే అందులో 20 శాతం కూడా ఖర్చు పెట్టలేదు. దివంగత ఎన్టీఆర్ హయాంలోనే కడప జిల్లాలో తెలుగుగంగ, హంద్రీనీవా, బ్రహ్మంసాగర్, గండికోట ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. జగన్ ఒక్క పైసా ఖర్చు చేయలేదు. టీడీపీ హయాంలో జిల్లాలో ప్రాజెక్టుల పనులను పరిగెత్తించాం. అయితే జగన్ పాలనలో వాటిని గాలికొదిలేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లాలో పెండింగు ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం. కడప జిల్లాను నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతాం అన్నారు.

### ఎమ్మెల్యేలపై ఫైర్

జిల్లాలోని ఎమ్మెల్యేలు ఐదేళ్లగా అవినీతి, అక్రమాలకు పాల్పడుతుంటే వారిని జగన్ మందలించలేదని, చూసీచూడనట్లు వదిలేశారని చంద్రబాబు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 29 మంది దళిత ఎమ్మెల్యేలను మార్చారు. అవినీతి ఆరోపణలున్న కడప జిల్లాలో మార్చడం లేదు. ఎక్కడ తిరుగుబాటు చేస్తారోనన్న భయం జగన్‌లో ఉందని చంద్రబాబు మండిపడ్డారు. పులివెందులలో గెలిచిన జగన్ ఇసుక, మద్యం కబ్జాలు ఇతరత్రా వాటితో రాష్ట్రాన్ని దోచుకుంటే.. పులివెందులలో మాత్రం ఆయన తమ్ముడు మదన్‌మోహన్‌రెడ్డి దోచుకుంటున్నారని చంద్రబాబు పేర్కొన్నారు. పులివెందుల భూకబ్జాలు, పనుల్లో కమీషన్లు, దళిత మహిళ నాగమ్మ హత్యాచారం ఇలా ఒకటేంటి పులి వెందులను చెరబట్టారు. ఇక మేనల్లుడికి దీటుగా ఆస్తులు సంపాదించాలనుకున్న కమలాపురం ఎమ్మెల్యే కరప్షన్ కింగ్‌గా మారారు. లేపాక్షిలో 20వేల కోట్ల విలువ చేసే 9వేల ఎకరాలను చీప్‌గా కొట్టేయా లనుకున్నారు. కడప శివార్లలో 200 కోట్ల విలువ చేసే 54 ఎకరాల భూమి కాజేశారు. సర్వరాయప్రాజెక్టు పరిధిలో 400 ఎకరాలు ఆక్రమించారు. బుగ్గవంకను ఆక్రమించి సినిమా థియేటరును నిర్మించారంటూ మండిపడ్డారు. ఇక బద్వేలు, కడప, ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగులో జరిగిన అవినీతి, అక్రమాలను వివరించారు.

**చంద్రబాబు పర్యటన సాగిందిలా**

వెంకటగిరిలో సభ ముగించిన చంద్రబాబు మధ్యాహ్నం 3.32 నిమిషాల ప్రాంతంలో హెలికాప్టరులో కమలాపురం బహిరంగసభ వేదిక వద్దకు చేరుకున్నారు. 4.02 నిమిషాలకు సభ వేదిక పైకి వచ్చారు. సభను టీడీపీ, జనసేన సంయుక్తంగా నిర్వహిస్తుండడంతో సభా వేదికపై ఉన్న ప్రతి ఒక్కరికి అభివాదం చేశారు. వేదికపై ఎమ్మెల్సీ రామచంద్రయ్య, పొలిట్‌బ్యూరోసభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కాల్వ శ్రీనివాసులు, మాజీమంత్రులు అమర్‌నాథరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జిలు పుత్తా నరసింహారెడ్డి, బీటెక్ రవి, పుట్టా సుధాకర్‌యాదవ్, రోశన్న, మాధవీరెడ్డి, భూపేశ్ రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వరద రాజులరెడ్డి, రమేశ్‌రెడ్డి, విజయమ్మ, మాజీ ఎమ్మెల్సీలు పుల్లయ్య, నారాయణరెడ్డి, శివనాథరెడ్డి, చంద్రదండు వ్యవస్థాపకులు ప్రకాశ్‌నాయుడు, టీడీపీ నేతలు అమీర్‌బాబు, సీఎం సురేశ్‌నాయుడు, పుత్తా చైతన్య రెడ్డి, పుత్తా లక్ష్మిరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ, టీడీపీ నేతలు అలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి, మన్మోహన్ రెడ్డి, కార్పొరేటరు ఉమాదేవి, రితీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఒక్క చాన్స్‌తో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు

- **రా కదలిరా సభలో జగన్ పాలనపై నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల మండిపాటు**

చెన్నూరు, జనవరి 19: తాను ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానం నెరవేరుస్తామని.. యువతకు బంగారు బవిష్యత్తు కల్పిస్తామని.. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని... ఒక్కచాన్స్ ఇవ్వాలంటూ.. ఎన్నికల ముందు కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్ జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, ప్రజలు గమనించి వైసీపీ పాలనకు రాబోవు ఎన్నికల్లో శాశ్వత సమాధి కట్టాలని జిల్లాలోని అన్ని నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు ధ్వజమెత్తారు. శుక్రవారం కమలాపురంలో జరిగిన రా కదలిరా సభకు హాజరై వారు మాట్లాడారు.



- **కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి** మాట్లాడుతూ సీఎం జగన్ మేనమామ రవీంద్రనాధరెడ్డి అక్రమ మార్గంలో ఆస్తులు సంపాదించుకోవడానికే ఈ నాలుగున్నరేళ్ల కాలం సరిపోయిందన్నారు. కమలాపురం మేజరు పంచాయతీని స్వార్థం కోసం నగర పంచాయతీగా మార్చి ప్రజలకు నరకం చూపించారని.. కనీసం ఉపాధి కూడా లేకుండా చేశారని మండిపడ్డారు. సర్వరాయసాగర్ నీళ్లు ప్రజలకందడం లేదని.. సీఎం జగన్ సొంత అవసరాలకు వాడుకుంటున్నారని విమర్శించారు. నియోజకవర్గంలోని ఏ మండలంలో కూడా అభివృద్ధి లేదని.. అలాంటి వ్యక్తికి రాబోవు ఎన్నికల్లో ప్రజలు తగిన విధంగా బుద్ధి చెప్పాలని కోరారు.



- **ప్రొద్దుటూరు ఇన్‌చార్జ్ జీవీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి** మాట్లాడుతూ జిల్లాలో ఇప్పుడున్న ఎమ్మెల్యేలు ఒక్క చోటైనా శాశ్వత అభివృద్ధి చేపట్టారా, మీరు అభివృద్ధి చేసి ఉంటే ఎక్కడ చేశారో చెప్పాలని సవాల్ చేశారు. దీనిపై మాట్లాడేందుకు ఏ సమయం.. ఏ తేదీ చెప్పినా తాను చర్చకు సిద్ధ మన్నారు. ప్రజలు ఉమ్మడి జిల్లాలో పది ఎమ్మెల్యే స్థానాలు, రెండు ఎంపీ స్థానాలు కట్టబెడితే.. చివరికి ఎందుకు వీరిని గెలిపించామా అని బాధపడే పరిస్థితికి తీసుకువచ్చారన్నారు.



- **కడప ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి** మాట్లాడుతూ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా కడప నగరాన్ని రూ.2150 కోట్లతో అభివృద్ధి చేశామని చెప్పడం సిగ్గుచేటన్నారు. అసలు ఆ అభివృద్ధి ఎక్కడుందో ప్రజలకు చూపించగలవా అని సవాల్ చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో నాలుగుచోట్ల నాలుగు పనులు చేసి ఇదీ వైసీపీ మార్కు అభివృద్ధి అని చెప్పుకోవడం దారుణమన్నారు.



- **పులివెందుల ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రారెడ్డి** మాట్లాడుతూ జిల్లాలో ఏ నియోజకవర్గం కూడా అభివృద్ధి చెందిన పాపాన పోలేదని.. ముఖ్యంగా సీఎం నియోజకవర్గమే వెనుకబడి ఉందని.. ఏ మాత్రం అభివృద్ధి చెందిందో నియోజకవర్గ ప్రజలకందరికీ తెలుసునన్నారు. చివరికి తల్లి, చెల్లికి కూడా అన్యాయం చేసిన వ్యక్తి నియోజకవర్గానికి, జిల్లాకు ఏం చేస్తారని తీవ్ర స్థాయిలో విమర్శించారు.

**హైలెట్స్**

- రా కదలిరా సభకు లక్షకు పైగా ప్రజలు రాక. ఆద్యంతం ఈలలు, చప్పట్లు, కేకలే
- చిన్నారులు, పెద్దలు జెండాలు చేతబట్టి చంద్రన్నకు జై అంటూ విజిల్స్.
- వేదిక చుట్టుపక్కల ఉన్న మిద్దెలపై నిలబడ్డ ప్రజలు చంద్రబాబు ప్రసంగిస్తున్నంత సేపు రెండు వేళ్లలో విక్టరీ చూపిస్తూ చప్పట్లు
- ఆటోలో తరలివచ్చిన వృద్ధ మహిళలు, సభ పూర్తయ్యేంత వరకు సభాస్థలిలోనే..
- ఎలాంటి ఇబ్బందులు లేకుండా సభ సక్సెస్ కావడంతో అంతులేని ఆనందంలో కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు
- మూడు కి.మీ మేర స్తంభించిన ట్రాఫిక్
- అయినా ఓపిగ్గా వాహనాలు పక్కన బెట్టి సభాస్థలికి తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు
- ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి ఓవరాక్షన్‌పై టీడీపీ కార్యకర్తలు, ప్రజల అసహనం
- రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా టీడీపీ నేతలు, కార్యకర్తలే దగ్గరుండి చూసుకోవడంతో వచ్చిన వారందరిలో ఆనందం.



రా..కదలిరా.. సభలో రెపరెపలాడుతున్న టీడీపీ జెండాలు



- **జమ్మలమడుగు ఇన్‌చార్జ్ భూపేష్‌రెడ్డి** మాట్లాడుతూ 2019లో ఓట్ల రాజకీయం చేసి తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి జిల్లా ప్రజలకు అభివృద్ధి అంటే ఏమిటో తెలియకుండా చేశారని మండిపడ్డారు. ఇలాంటి ప్రభుత్వాన్ని ఏం చేయాలో ప్రజలే నిర్ణయించాలన్నారు.









రా... కదలిరా సభలో మాట్లాడుతున్న నేతలు - మిద్దెలపైకి ఎక్కిన జనం - చంద్రబాబు ప్రసంగానికి ఈలలు వేస్తున్న జనం

## కనకదుర్గమ్మ ఆలయ బోర్డు మెంబర్ ప్రభాకర్‌రెడ్డిపై వైసీపీ సర్పంచు ఫిర్యాదు

- పులివెందులలో కేసు నమోదు

పులివెందుల టౌన్,జనవరి 19: వీఎన్‌పల్లె మండలం బుసిరెడ్డిపల్లె సర్పంచు అనురాధ విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ బోర్డు మెంబర్ ప్రభాకర్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. వివరాలిలా.. విజయవాడ బెంజ్ సర్కిల్‌లోని నారాయణ కళాశాలలో నా కూతురు ఇంటర్ చదువుతున్న సమయంలో కిడ్నాప్ చేస్తానని... నేను వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఉన్న సమయంలో నాకు పరిచయం అయిన గుంటూరు జిల్లా తాడేపల్లెకు చెందిన ప్రభాకర్‌రెడ్డి 2022లో ఆగస్టులో బెదిరించారు. దీంతో నా కూతురు ఎల్.దీప్తిని ఎక్కడ కిడ్నాప్‌చేస్తారో అని భయపడిన నాభర్త, నా భర్త అన్నలు బాలగంగిరెడ్డి, రామిరెడ్డిలు రూ.10లక్షలు తీసుకెళ్లి తాడేపల్లె పెట్రోల్ బంకు దగ్గర ఇచ్చి వచ్చారు. మళ్లీ ఈ మధ్య కాలంలో జె.ప్రభాకర్‌రెడ్డి తన ఫోన్ ద్వారా నా భర్తఫోన్‌కు ఫోన్ చేయగా.. నేను ఫోన్ తీస్తే.. బూతులు మాట్లాడుతూ నాకు రూ.50లక్షలు తీసుకొచ్చి ఇవ్వకుంటే నీ భర్తను చంపుతానంటూ.. నన్ను అవమానకరంగా దూషించాడు. అతడు, అతని గ్యాంగు వల్ల నా భర్తకు ప్రాణహాని ఉందన్నారు. నా భర్త ప్రాణాలను తీస్తానని బెదిరిస్తున్న జె.ప్రభాకర్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కోరినట్లు ఫిర్యాదులో తెలియజేశారు. ఈ విషయమై సర్పంచు అనురాధ, ఆమె భర్త రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ తనపై ప్రభాకర్‌రెడ్డి తాడేపల్లె పోలీస్‌స్టేషన్‌లో అపద్దపు ఆరోపణలతో ఫిర్యాదు చేశారన్నారు. తాను ఏదో ప్రభాకర్‌రెడ్డి నుంచి డబ్బులు వసూల్ చేశాడని తాడేపల్లె పోలీసులు ఛీటింగ్ కేసు నమోదు చేశారన్నారు.

## రేపు నగరంలో శ్రీరామ మహాశోభాయాత్ర



కడప (కల్చరల్), జనవరి 19: అయోధ్య ఐక్యత వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 21న ఆదివారం కడప నగరంలో శ్రీరామ మహాశోభాయాత్ర జరగనున్నదని ఆ వేదిక ప్రతినిధులు వెల్లడించారు. ఆ మేరకు ఉదయం 7గంటలకు చిన్నచౌకులోని ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి ప్రారంభమవుతుందన్నారు. అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామాలయంలో ఈనెల 22న శ్రీరామచంద్ర మూర్తి విగ్రహ ప్రతిష్ఠ జరగనున్న నేపథ్యంలో శోభాయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఈ యాత్ర చిన్నచౌకు, అప్సరసర్కిల్, వైజంక్షన్, ఆర్టీసీ బస్టాండు సర్కిల్, ఎస్పీ బంగ్లా, రాజారెడ్డివీధి, నెహ్రూ పార్కు, అన్నమయ్య సర్కిల్, క్రిష్ణసర్కిల్, గోకుల్ సర్కిల్, వన్‌టౌన్ సర్కిల్, పాత బస్టాండు, సెవన్‌రోడ్స్ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, కోటిరెడ్డిసర్కిల్, ఐటీఐ సర్కిల్, కాగితాలపెంట, సంధ్య సర్కిల్, ఎర్రముక్కపల్లె సర్కిల్, రాజీవ్‌పార్కు మీదుగా హౌసింగ్ బోర్డు కాలనీ శ్రీకోదండ రామాలయం వరకు సాగుతుందన్నారు. కాగా, ఈనెల 22న ఉదయం 6గంటలకు శ్రీరామనామ హోమం నిర్వహించిన తరువాత భక్తుల స్వహస్తాలతో శ్రీరామలక్ష్మణ సీతా ఆంజనేయుల విగ్రహాలకు 10 గంటల నుంచి అభిషేక కార్యక్రమాలు జరుగుతాయి. అయోధ్యలో రామప్రతిష్ఠ జరిగే సమయంలో ఆలయంలో స్క్రీన్ ఏర్పాటు చేసి భక్తులకు ప్రతిష్ఠ కార్యక్రమం చూపించే ఏర్పాట్లు చేశారు. శ్రీరామ మహాశోభాయాత్ర కుల మతాలు, వర్గాలు, పార్టీలకు అతీతంగా జరుగుతున్నదని. యాత్రలో పాల్గొనే భక్తులు సంప్రదాయ తెల్లని దుస్తుల్లో పాల్గొనాలని నిర్వాహకులు తెలిపారు. 22న సాయంత్రం పాలకొండపై శ్రీరామ అఖండ దివ్య జ్యోతిని వెలిగించి భక్తులందరూ రామజ్యోతిని దర్శించి శ్రీరామ పరిపూర్ణ అనుగ్రహాన్ని పొందగలరని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చెక్క భజన, కోలాటం, కేరళ వాయిద్యం, దేవతా వేషధారణలు, భజరంగి విన్యాసాలతో శ్రీరామచంద్రుని 18 అడుగుల దివ్య విగ్రహంతో ఈ యాత్ర సాగుతుందన్నారు. యాత్ర సందర్భంగా భక్తులకు వివిధ ప్రాంతాల్లో అల్పాహారం, పానకం, భోజన వసతి కల్పించనట్లు నిర్వాహకులు తెలిపారు.

## నలుగురికి వీక్లి బెస్ట్ పెర్మార్మెన్స్ అవార్డు



అత్యుత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందికి అవార్డు అందజేసిన ఎస్పీ

కడప (క్రైం), జనవరి 19: పోలీసు సిబ్బందిని ప్రోత్సహించే క్రమంలో జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ అత్యుత్తమ పనితీరు కనబరిచిన వారికి వీక్లీ బెస్ట్ ఫెర్మార్మెన్స్ అవార్డును అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నలుగురు సిబ్బందిని ఎంపిక చేసిన నగదు రివార్డులు, ప్రశంసాపత్రం అందించి ప్రత్యేకంగా అభినందించారు. ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో వాహన తనిఖీల్లో ఎలాంటి బిల్లులు లేకుండా తరలిస్తున్న రూ.35లక్షల నగదు స్వాధీనం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించిన కానిస్టేబుళ్లు ఎం.శ్రీనివాసులు, నవీన్‌కుమార్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. అలాగే జమ్మలమడుగు పోలీసుస్టేషన్ పరిధిలో వాహన తనిఖీల్లో ఎలాంటి బిల్లులు లేకుండా తరలిస్తున్న రూ.5లక్షల నగదు స్వాధీనం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించిన కానిస్టేబుళ్లు నాగేంద్ర, లక్ష్మణ్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. మున్ముందు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని ఆకాంక్షించారు.

## సాహిత్యంలో తరగని సంపద వేమన పద్యాలు : కలెక్టర్



వేమన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైవీయూ వీసీ, రిజిస్ట్రార్‌లు

కడప(కలెక్టరేట్), జనవరి 19: సామాన్యులకు సైతం అర్థమయ్యేలా తెలుగు బాషను సరళంగా వర్ణించిన ప్రజా కవి యోగి వేమన అని, తెలుగు సాహిత్య రంగంలో తరగని సంపద అని కలెక్టర్ విజయరామరాజు అభివర్ణించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో యోగి వేమన జయంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆటవెలది పద్యాల రూపంలో సామాన్య ప్రజానీకానికి అర్థమయ్యే వాడుక భాషలో అద్భుతమైన కవిత్వాన్ని అందించిన ఘనత యోగి వేమనకు దక్కుతుందన్నారు. సామాజిక రుగ్మతలపై, సమాజ సంస్కరణకు కృషి చేసిన గొప్ప దార్శినికుడు వేమన అన్నారు. వేమన ప్రతి రంగాన్ని నిశితంగా పరిశీలించి నాటి సమాజంలో జరిగే అక్రమాలపై తనదైన శైలిలో నిర్భయంగా, నిజాయితీగా వర్ణించారన్నారు. తెలుగు సాహిత్య, సామాజిక చరిత్రలో తనదైన ముద్ర వేసిన మహనీయుడన్నారు. వేమన ఆవిష్కరించిన నైతిక విలువలను పెంపొందించే కావ్యాలను యువత ఆదర్శంగా తీసుకొని నవ సమాజ సంస్కరణలో భాగస్వాములు కావాలన్నారు.. అంతకుముందు యోగి వేమన చిత్ర పటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. డీఆర్వో గంగాధర్ గౌడ్, కలెక్టరేట్ ఏవో విజయకుమార్, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**వేమన పద్యాలు వ్యక్తిత్వ వికాసాలు**

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 19: ఉన్నతమైన వ్యక్తిత్వం అలవడాలంటే వేమన పద్యాలు అర్థం చేసుకుని అనుసరిస్తే చాలని వైవీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ అన్నారు. శుక్రవారం వైవీయులో వేమన జయంతి ఉత్సవం నిర్వహించారు. ముందుగా వేమ న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంత రం ఆయన మాట్లాడుతూ మహాకవి వేమన పద్యాలు సమాజాన్ని మేలుకొలుపుతాయన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసరు వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ రఘునాధరెడ్డి మాట్లాడారు. వైవీయూ పాలక మండలి సభ్యులు డాక్టర్ మాదక్క, బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు. కడప నగరం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో వేమన జయంతిని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా వైస్ చాన్సల ర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈనాటికీ సమాజంలో ప్రజల మధ్య సంభాషణల్లో సామెతలు, వేమనపద్యాలు గుర్తు చేసుకుంటూనే ఉన్నామన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసరు రమాదేవి, చింతకుంట శివారెడ్డి, భూతపురి గోపాలక్రిష్ణశాస్త్రి, జి.హరిభూషణరావు ఉన్నారు.

## ఆర్థిక బకాయిల చెల్లింపులో అలసత్వం వీడాలి

- ఐఆర్ 30 శాతం ప్రకటించాలి
- యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా





ర్యాలీగా వస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 19: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు బాకీ పడ్డ ఆర్థిక బకాయిల చెల్లింపులో అలసత్వం వీడాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు తెలిపారు. ఐఆర్ 30 శాతం, పీఆర్సీ విధి విధానాలు, పాత పెన్షన్ విధానం ప్రకటించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం మహవీర్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు చెవిలో పువ్వులతో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ సీఎం ప్రతిపక్ష నేతగా పాదయాత్ర సమయంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాలసిన ఆర్థిక బకాయిలు సకాలంలో చెల్లిస్తారని.. మెరుగైన పీఆర్సీ ప్రకటిస్తానని సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన విషయం గుర్తు చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయులు అడిగేవన్నీ న్యాయబద్ధమైనవేనని దేవుడిదయ వల్ల మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి.. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్నా సమస్యలు పరిష్కరిచకుండా చెవిలో పువ్వులు పెట్టారని, అందుకోసం మా చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన చేపట్టామన్నారు. వృద్ధాప్యంలో అవసరాలకు ఉపయోగపడుతుందని పొదుపులో దాచుకున్న జీవితబీమా సొమ్ము, సరెండరు లీవు బిల్లులు, మెడికల్ రీయిబర్స్‌మెంటు, డీఏ, పీఆర్సీ అరియర్స్ చెల్లించకుండా కాలయాపన చేయడం తగదన్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఓట్ ఫర్ ఓపీఎస్ పేరుతో తమ సమస్యలు ఎవరు పరిష్కరిస్తారో వారి వైపే ఉద్యోగ ఉపాధ్యాయులు ఉంటారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు నరసింహారావు, శ్రీనివాసులు, ఎజాజ్ అహ్మద్, ప్రభాకర్, అయ్యవారు రెడ్డి, శ్రీనివాసరెడ్డి, గాజులపల్లె గోపినాధ్, చంద్రశేఖర్, శివశంకర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి: కలెక్టర్

కడప(కలెక్టరేట్), జనవరి 19: జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ విజయరామరాజు డీఐఈపీసీ సభ్యులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు జేసీ గణేశ్‌కుమార్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటూ పారిశ్రామిక రంగాన్ని మరింత పటిష్ఠం చేయాలన్నారు. పరిశ్రమలు జిల్లా ఆర్థిక ప్రగతికి మూలమన్నారు. పారిశ్రామికాభివృద్ధి వడ్డీ రాయితీల కింద 13 యూనిట్లకు సంబంధించి రూ.30.6 లక్షల రాయితీ విడుదలకు కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల జనరల్ మేనేజరు జయలక్ష్మీ, జెడ్ఎం నాగరాజు, డిక్కీ కో- ఆర్డినేటర్ శివశంకర్, ఏపీఐఐసీ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు వేగవంతం : జేసీ

కడప(కలెక్టరేట్), జనవరి 19: ఈ నెల 26న నిర్వహించనున్న 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో వేడుకలకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఏఎస్పీ కృష్ణారావులతో కలిసి అన్ని శాఖల అధికారులతో జేసీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జెండా వందనానికి ఏర్పాట్లు ఎంతవరకు చేశారని ఆరా తీశారు. శకటాల ఏర్పాట్లు, స్టాళ్లు, వేదిక అందంగా అలంకరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని జేసీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తులకు జైలుశిక్ష, జరిమానా

కడప (క్రైం), జనవరి 19: మద్యం సేవించి మోటరు సైకిలు నడుపుతూ పోలీసు తనిఖీల్లో పట్టుబడిన వేర్వేరు వ్యక్తులకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ కడప ఫస్ట్ స్పెషల్ జేఎస్‌సీఎం కోర్టు తీర్పునిచ్చింది. వివరాలా.. షేక్ షంషీర్ అనే వ్యక్తి ఈ నెల 17న మద్యం సేవించి మోటరు సైకిలు నడుపుతూ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డాడు. దీనిపై కేసు నమోదు చేశారు. విచారణలో సాక్ష్యాధారాలతో నేరం రుజువు కావడంతో కోర్టు ఏడు రోజులు జైలుశిక్ష, రూ.3వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు కడప ట్రాఫిక్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. అలాగే గజ్జల నాగమల్లారెడ్డి అనే వ్యక్తి ఈనెల 18న మద్యం సేవించి మోటరు సైకిలు వాహనం నడుపుతుండగా పోలీసుల అతన్ని పట్టుకుని కేసు నమోదు చేశారు. ఈ మేరకు అతనికి కోర్టు 4 రోజులు జైలుశిక్ష, రూ.3వేలు జరిమానా విధించినట్లు కడప ట్రాఫిక్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు.

## పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే ధ్యేయం

కడప (క్రైం), జనవరి 19 : పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం ఎస్పీ సిద్దార్థ కౌశల్ జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు గ్రీవెన్స్‌డే నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసుస్టేషన్లు, ఆయా విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది బదిలీలు, వ్యక్తిగత, స్పౌస్, చిల్డ్రన్స్ మెడికల్ సమస్యల గురించి ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని సిబ్బందికి ఎస్పీ భరోసా ఇచ్చారు. సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని సంబంధిత జిల్లా పోలీసు కార్యాలయ అధికారులకు ఆదేశించారు.

## రవీంద్రనగర్‌లో చోరీ

కడప (క్రైం), జనవరి 19 : కడప నగరం రవీంద్రనగర్‌లో ఇంటి ముందు పార్కింగ్ చేసిన స్కూటీని ఓ దొంగ తలకు మాస్కు తగలించుకుని చోరీకి పాల్పడ్డాడు. ఆ సంఘటన అక్కడున్న సీసీ కెమెరాలో రికార్డు అయింది. రవీంద్రనగర్‌కు చెందిన ఓ వ్యక్తి రాత్రి ఇంటి ముందు స్కూటీ పార్కింగ్ చేయడంతో గుర్తు తెలియని వ్యక్తి మాస్కు ధరించి.. వీధుల్లో తిరుగుతూ నకలీ తాళం ద్వారా స్కూటీ లాక్ తీసుకుని అక్కడ నుంచి పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు తాలుకా పోలీసులు కేసు నమోదు చేశారు.

## సాయినాథశర్మకు సేవా రత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న సాయినాథశర్మ

కమలాపురం (కడప ఎన్టీఆర్ సర్కిల్), జనవరి 19: ప్రజాసేవే లక్ష్యంగా తనదైన శైలిలో పనిచేస్తున్న కమలాపురానికి చెందిన కాశిభట్ల సత్యసాయినాథశర్మ కరోనా సమయంలో చేసిన సేవలకు కేంద్ర ప్రభుత్వ నీతి అయోగ్ సాంఘిక సంక్షేమ మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఇండియన్ ఐకానిక్ పీస్ కౌన్సిల్ ఆధ్వర్యంలో డాక్టరేట్ అవార్డుతో పాటు సేవా రత్నబిరుదును న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషనల్ క్లబ్‌లో టిబెట్ దేశం ఉపాధ్యక్షుడు ఆచార్య యేషి ప్రదానం చేశారు. శుక్రవారం సాయంత్రం కేంద్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు ముఖ్యఅతిధిగా హాజరైన ఈ సమావేశంలో విశిష్ట అతిథిగా కేంద్ర ప్రభుత్వం తరపున టిబెట్ దేశ ఉపాధ్యక్షుడు ఆచార్య యేషి విచ్చేశారు. ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఈ అవార్డు 2023 సంవత్సరానికి సాయనాథశర్మ ఎంపిక కావడం ఆయన నిస్వార్థ ప్రజా సేవా నిరతికి నిదర్శనంగా నిలుస్తోంది. ఈ సందర్భంగా సాయినాథశర్మ మాట్లాడుతూ తనకు అవార్డులు వస్తాయని పనిచేయలేదన్నారు. కరోనా కష్టకాలంలో మొదటి విడతలో ఆకలితో అలమటించే వారికి అన్నం పెట్టడం, రెండో విడతలో ఆక్సిజన్ అందక ఇబ్బందులు పడుతున్న అనేక మంది నిరుపేదలకు ఉచితంగా ఆక్సిజన్ సిలిండర్స్ అందించి.. చేతనైనంత సాయం చేశానని అన్నారు.

## ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి



టీడీపీ నాయకులు, కార్యకర్తలతో రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, జనవరి19: ప్రతి కార్యకర్త సైనికుడిలా టీడీపీ విజయానికి కృషి చేయాలని రాయచోటి టీడీపీ నేత మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని అక్రమ్ మండీ దగ్గర శుక్రవారం చిన్నమండెం టౌన్, బలిజపల్లెకు చెందిన అభిమానులు, టీడీపీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీని అధికారంలోకి తీసుకు రావడానికి ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయా లని సూచించారు. తెలుగుదేశం ప్రభుత్వం నిర్వహిస్తున్న రా కదలి రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీలతో పాటు పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు జవహర్ నవోదయ పరీక్ష

లక్కిరెడ్డిపల్లె జనవరి 19: జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశానికి నేడు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జడ్పీ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, చీఫ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరులు తెలిపారు. లక్కిరెడ్డిపల్లె డివిజన్‌పరిధిలో 270 మంది విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్నారని, వారంతా ఆన్‌లైన్‌లోనే హాల్‌టికెట్ తీసుకుని లక్కిరెడ్డిపల్లె జడ్పీ బాలుర పాఠశాలలో పరీక్షకు హాజరుకావాలన్నారు. పరీక్ష ఉదయం 11.30 గంటల నుంచి 1.30 వరకు జరుగుతుందని, పరీక్ష కేంద్రానికి గంట ముందు చేరుకోవాలన్నారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలియ జేశారు.

## యండపల్లి పీహెచ్‌సీ తనిఖీ

రాయచోటిటౌన్, జనవరి19: మండల పరిధిలోని యండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం అడిషనల్ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ శైలజ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఎల్పీడీసీ సర్వేలో పెండింగ్ కేసులను పూర్తి చేయాలని ఆదేశించారు. టీబీ, లెప్రసీ రికార్డులను తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. సస్పెక్ట్ కేసులను పరిశీలించి చికిత్స అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఈవో దేవప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ దేవేంద్ర, స్టాఫ్‌నర్స్ కవిత, ఖాదర్‌బీ, ల్యాబ్ టెక్నీషియన్ రాజేంద్ర, విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డీసీసీ ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ అలీఖాన్

రాయచోటిటౌన్, జనవరి 19: కాంగ్రెస్ పార్టీ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాయచోటి పట్టణానికి చెందిన పఠాన్ మహమ్మద్ అలీఖాన్‌ను నియమిస్తూ శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు షేక్. అల్లాబకష్ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్, రాజంపేట పార్లమెంట్ ఇన్‌చార్జి తులసి రెడ్డి, రాష్ట్ర మైనార్టీ వైస్ చైర్మన్ మహమ్మద్‌రఫీ, జిల్లా కార్యదర్శి బషీర్‌అహ్మద్, అమీర్, చెన్నకృష్ణ తదితరులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## 'ప్రజా సేవలో ముందంజలో ఆర్టీసీ'

రాయచోటిటౌన్, జనవరి 19: ప్రయాణికుల సేవలో ఏపీఎస్‌ఆర్టీసీ ఎల్లప్పుడూ ముందే ఉంటుందని ఆ సంస్థ డైరెక్టర్ రాజారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన రాయచోటి బ స్టాండును పరిశీలించిన అనంతరం ఆర్‌యం కార్యాలయంలో పాత్రికేయుల సమా వేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో వెయ్యి ఎలక్ట్రికల్ బస్సులు, 1500 డీజిల్ బస్సులు అందుబాటులోకి తేనున్నట్లు చెప్పారు. 2024-25కు గానూ అత్యధికంగా 500 కోట్లు ఆదాయం పెంచేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలియజేశారు. రీజనల్ మేనేజర్ రాము, రాయచోటి డిపో మేనేజర్ ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ మెంబర్‌కు సన్మానం

రాజంపేట, జనవరి 19: బీఎస్‌ఎన్‌ఎల్ టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా నూతనంగా ఎన్నికైన పట్టుపోగుల సూర్యచంద్రకు బీజేపీ నేతలు ఘనంగా సన్మానించారు. రాజంపేట బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పోతుగుంట రమేష్‌నాయుడు మాట్లాడుతూ బీజేపీలో నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలందరికీ కూడా పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందన్నారు. పట్టుపోగుల సూర్యచంద్ర గతంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శిగా, రాజంపేట మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ తరఫున వార్డు మెంబర్‌గా పోటీ చేశారన్నారు. తనపై నమ్మకంతో పార్టీ ఇచ్చిన పదవి నిబద్ధతతో పనిచేసే ప్రజలకు మరింత చేరుకోవాలన్నారు.

## 23న సుండుపల్లె మండల సర్వసభ్య సమావేశం

సుండుపల్లె, జనవరి19: ఈ నెల 23వ తేదీన ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో ఎంపీపీ రాజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామచంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

# మంత్రి అసత్య ప్రచారాలు మానుకోవాలి

- 39వ రోజు కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకొని అంగన్వాడీల నిరసన



రాయచోటి: కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు



రైల్వేకోడూరు: అంబేడ్కర్‌కు నివాళి అర్పించి నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 19: అంగన్వాడీల సమస్యలన్నీ పరిష్కరించామని బొత్స సత్యనారాయణ చెప్పడం సరికాదని, సమస్య లు పరిష్కరిస్తే సమ్మె విరమిస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కే విశ్వనాథ్‌నాయక్, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోషియేషన్ ఏఐటీయూసీ అనుబంధం జిల్లా కన్వీనర్ నాగేశ్వరి తెలిపారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోషియేషన్ సభ్యులు 39వ రోజు కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్ట ప్రకారమే అంగన్వాడీలు సమ్మె చేస్తున్నారని సమస్యలు పరిష్కరిస్తేనే సమ్మె విరమిస్తారన్నారు. ప్రభుత్వం మొండి పట్టుదలకు పోయి అంగన్వాడీలను, ప్రజలను, తల్లులను, బిడ్డలను ఇబ్బందులకు గురి చేస్తున్నదని ఆరోపించారు. అంగన్వాడీల సమ్మెపై ప్రభుత్వం అసత్య ప్రచారాలు చేస్తున్నదన్నారు. జూలైలో వేతనాలు పెంచాలన్న ఆలోచన ఉంటే, ఎంత పెంచుతారో చెప్పకుండా దాచడంలో ఆంతర్యం ఏమిటన్నారు. ప్రభుత్వం మరోమారు అంగన్వాడీలను మోసం చేయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, సుజాత, అనురాధ, రజినీ, లోకేశ్వరి, రామతులసమ్మ, స్వర్ణకుమారి, దుర్గా, భారతి, శోభా, పద్మా వతమ్మ, విజయ, కుమారి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

**రైల్వేకోడూరు:** అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం నాటకాలాడుతోందని జిల్లా అంగన్వాడీ సంఘం అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, రైల్వేకోడూరు ప్రాజెక్టు లీడర్ రమాదేవి తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరులోని మండల పరిషత్ కార్యాలయాల ఆవరణలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించిన అనంతరం నిరసన వ్యక్తం చేశారు. నాయకురాళ్లు పద్మ, లీలా, దుర్గా, శిరీషా పాల్గొన్నారు.

**లక్కిరెడ్డిపల్లె:** అంగన్‌వాడీలు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ప్రభావతి, ఇరగమ్మ, లక్ష్మిదేవి, నాగవేణి, మూడు మండలాల అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

**రాజంపేట టౌన్:** . 39రోజులుగా ఆందోళన చేస్తుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేదని, ఈ విధంగా మహిళలను ఇబ్బందులకు గురి చేయడం ముఖ్యమంత్రికి తగునా అని ప్రశ్నించారు. చిట్వేలి రవికుమార్, నాయకురాలు ఈశ్వరమ్మ, విజయ, అమరావతి, శివరంజిని, గౌసియా, శివ, జ్యోత్స్న పాల్గొన్నారు.

## 'దళిత ద్రోహి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి'



రాజంపేట: నిరసన వ్యక్తం చేస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు



రైల్వేకోడూరు: నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ దళిత నాయకులు

రాజంపేట, జనవరి19 : దళిత ద్రోహి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అంటూ రాజంపేట అంబేడ్కర్ విగ్రహం ఎదుట టీడీపీ నాయకులు శుక్రవారం నిరసన ప్రదర్శన చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెన్నూరు సుధాకర్, ఎస్సీ ఎస్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మందా శ్రీని వాసులు, టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేపూరి వేణుగోపాల్, రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి ప్రతాప్‌రాజు తదితరుల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితుడైన కోడికత్తి శ్రీనును ఎన్నికల ముందు అక్రమంగా కేసులో ఇరికించి ఐదేళ్లుగా నానా ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. శ్రీనును వెంటనే విడుదల చేయించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ప్రలోభాలకు గురి చేసేందుకే అంబేడ్కర్ స్మృతివనం ఏర్పాటు చేశారని ఆరోపించారు. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారం చేపడితే రాష్ట్రంలో దళిత జాతే అంతరించిపోతుందన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజంపేట టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కొల్లు రెడ్డయ్య నాయుడు, టీడీపీ మహిళా నేత మిరియాల జ్యోతి, రాష్ట్ర బీసీ సెల్ నాయకులు ఇడిమడకల కుమార్, రాజంపేట పట్టణ టీడీపీ అధ్యక్షులు సంజీవరావు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

**రైల్వేకోడూరు:** దళితులపై దమనకాండకు నిరసనగా, కోడికత్తి శ్రీనుకు మద్దతుగా శుక్రవారం రైల్వేకోడూరు మండల టీడీపీ అధ్యక్షుడు కొమ్మా శివ, దళిత నాయకుడు, రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు పులేల రమేష్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోడికత్తి శ్రీను కేసు నీరుగారిపోయినా జైల్లోనే మగ్గిపోతున్నాడన్నారు. జైలులో ఒక దళితుడు మగ్గిపోతున్నా పట్టించుకోని ప్రభుత్వం అంబేడ్కర్ విగ్రహాన్ని ఎలా ఆవిష్కరిస్తుందన్నారు. అంబేడ్కర్ కూడా వైసీపీ ప్రభుత్వాన్ని క్షమించడన్నారు. అంబేడ్కర్ వారసులం అని చెప్పుకుంటున్న వైసీపీ వాదులకు సిగ్గు లేదన్నారు. డాక్టర్ సుధాకర్ మరణించడానికి కారణం వైసీపీ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రం లో దళితులకు స్వేచ్ఛ లేదన్నారు. రైల్వేకోడూరు ఎస్సీ నియోజకవర్గం అయినా దళితులకు న్యాయం జరగడం లేదన్నారు. దళితవాడలు నేటికీ అభివృద్ధికి దూరంగానే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు తేనేపల్లి చిన్నా, దళిత నాయకులు గడ్డం శ్రీరాములు, రమేష్, నరసింహులు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీతోనే బీసీల అభ్యున్నతి



జయహో బీసీ కార్యక్రమంలో నేతలు

చిన్నమండెం, జనవరి 19: బీసీలకు స్వేచ్ఛ సమానత్వం టీడీపీతోనే సాధ్యమని రాజంపేట పార్లమెంట్ టీడీపీ బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి అలగాని రెడ్డెప్ప తెలిపారు మండలంలోని కేశాపురం దేవలంపేటలో శుక్రవారం జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని అధికారంలోకి తెచ్చుకోవాలని సూచించారు. అలాగే 24న పీలేరులో నిర్వహించే రా.. కదలిరా బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మండల టీడీపీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, యూనిట్ ఇన్‌చార్జులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, రాజంపేట పార్లమెంట్ పరిధి బీసీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రా.. కదలిరా.. సమావేశానికి సిద్దవటం నేతలు

సిద్దవటం, జనవరి19 : మండల టీడీపీ నాయకుడు, మోహన్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి దశరథనాయుడు ఆధ్వర్యంలో పలువురు టీడీపీ నేతలు శుక్రవారం కమలాపురంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బహిరంగ సభకు హాజరయ్యారు. నాయకులు చెంచయ్యనాయుడు, శివ, ఓబులేసు పాల్గొన్నారు.

## అభివృద్ధి ప్రణాళికల తయారీపై శిక్షణ

రాయచోటిటౌన్, జనవరి 19: గ్రామ పంచాయతీల్లో 2024-25లో అభివృద్ధి ప్రణాళికల తయారీపై శుక్రవారం రాయచోటి మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి మల్‌రెడ్డి మాట్లాడుతూ మండల పరిధిలోని 9 గ్రామ పంచాయతీల్లో 2024-25 సంవత్సరంలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామాల్లో పర్యటించి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. నివేదికలను పకడ్బందీగా తయారు చేసి మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణాధికారి సురేశ్‌బాబు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వివిధ శాఖల మండల స్థాయి, గ్రామ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## 20న డయల్ యువర్ ఏపీఎస్ ఆర్టీసీ

రాయచోటిటౌన్, జనవరి19: ఈ నెల 20న ఆర్టీసీ సమస్యలపై డయల్ యువర్ ఏపీఎస్‌ఆర్టీసీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి పీ. రాము శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లాలో ఏపీఎస్‌ఆర్టీసీకి సంబంధించి ఎటువంటి సమస్యలున్నా ఈ నెల 20వ తేదీ సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు నిర్వహించే డయల్ యువర్ జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యక్రమంలో తెలియజేయాలన్నారు. కావున జిల్లాలోని ప్రజలు, ప్రయాణికులు తమ సమస్యలను, సూచనలు, సలహాలను 8985283211 అనే నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చునన్నారు.

## మోటారు చోరీలతో రైతుల బెంబేలు

ఓబులవారిపల్లె, జనవరి 19 : మోటార్ల చోరీతో మండలంలోని చిన్నఓరంపాడు కమ్మపల్లి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గురువారం రాత్రి సుమారు 13 మోటార్లకు సంబంధించిన విద్యుత్ వైర్లు చోరీకి గురయ్యాయి. పోలీసు అధికారులు చొరవ తీసుకొని రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

## ఉద్యోగులకు బకాయిలు చెల్లించండి



యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

రాయచోటిటౌన్, జనవరి19: ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం బాకీ ఉన్న రూ. 18,096 కోట్ల బకాయిలను చెల్లించకపోవడం న్యాయమేనా అనే విషయం ప్రభుత్వ పెద్దలు చెప్పాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్. జాబీర్ ప్రశ్నించారు. శుక్రవారం సాయంత్రం రాయచోటి తహసీల్దార్ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినా బకాయిలను చెల్లించకపోవడం అన్యాయమన్నారు. ప్రతి నెల 1న జీతాలు చెల్లించాలని, 12వ పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేసినా ఆ కమిటీ విధి విధానాలు వెల్లడించకపోవడం మభ్యపెట్టడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. 12వ పీఆర్‌సీపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా బకాయిలు విడుదల చేయని పక్షంలో ఈ నెల 24న జిల్లా స్థాయి నిరసన, 31 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు జిల్లా కేంద్రం లో రిలే దీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు ప్రసాద్, రాయచోటి మండల అధ్యక్షుడు హఫీజుల్లా, సహాధ్యక్షుడు రఫీ, చిన్నమండెం మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సహాధ్యక్షుడలు కిఫాయతుల్లా, రెడ్డిముని, సుధాకర్, సీనియర్ నాయకులు ఉమాశంకర్, వీరబల్లి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగార్జున, అమీనుల్లా, గాలివీడు మండల నాయకులు ఫయాజ్, ఇమ్రాన్, సుధాకర్‌రాజు, ఫయాజ్, నాసిర్‌ఖాన్, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు సమావేశాలకు రాకపోతే ఎలా..

సంబేపల్లె, జనవరి 19: మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు రాకపోతే ఎలా అంటూ మండల అధ్యక్షురాలు ఆవుల నాగశ్రీలక్ష్మి ప్రశ్నించారు. శుక్రవారం సంబేపల్లె మండల సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలానికి రెగ్యులర్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు లేకపోగా, ఇన్‌చార్జి అధికారులు సమావేశానికి రాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. గురిగింజకుంట సర్పంచ్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ అసైన్మెంట్ కమిటీ గడువును ఈ నెల చివరి వరకు పెంచాలని కోరారు. కడప డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీడీవో నరసింహులు, డిప్యూటీ తహసీల్దార్ రవి, సర్పంచ్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, రఘునాథరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు పొత్తూరి రవీంద్రనాయుడు, మీసాల భాగ్యమ్మ, ఎంపీటీసీ శ్రీధర్‌రెడ్డి, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం మహిళా కార్యవర్గం ఎన్నిక

రాయచోటిటౌన్, జనవరి19: పట్టణంలోని ఎన్జీవో హోంలో శుక్రవారం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అన్నమయ్య జిల్లా మహిళా విభాగం కార్యవర్గాన్ని ఏపీజేఏసీ అమరావతి అన్నమయ్య జిల్లా చైర్మన్ నరసింహారావు, జనరల్ సెక్రటరీ మల్లికార్జున ఎన్నుకున్నారు. చైర్‌పర్సన్‌గా నిర్మలాదేవి (రెవెన్యూ), ప్రధాన కార్యదర్శిగా ఎం. సాలమ్మ (ఆర్టీసీ), వివిధ డిపార్టుమెంట్‌లకు చెందిన మరో 10 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.




## ఆవులకు అంతు పట్టని వ్యాధి

- నాలుగు రోజుల్లో 15 ఆవులు మృత్యువాత
- రైతుల ఆందోళన



ఆవు మృత కళేబరంతో నిరసన తెలుపుతున్న రైతులు

రామాపురం, జనవరి 19: నాలుగు రోజుల వ్యవధిలో 15 ఆవులు అనారోగ్యంతో మృతి చెందడంతో రాచపల్లి గ్రామంలోని పశుపోషకులు శుక్రవారం రామాపురంలోని మూడు రోడ్ల కూడలిలో మృతి చెందిన ఆవులతో ఆందోళన చేశారు. నాలుగు రోజుల్లో వెంకట సుబ్బారెడ్డికి చెందిన నాలుగు, ప్రసాద్‌రెడ్డికి చెందిన నాలుగు, అమృతనాయుడుకు చెందిన ఒక ఆవుతోపాటు మొత్తం 15 ఆవులు మృతి చెందాయి. వాటి మృతికి కారణమేమిటో తెలియడం లేదని రైతులు అంటున్నారు. ఒక్కొక్క ఆవు విలువ రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఉంటుందని, గ్రామంలో ఇప్పటిదాకా రూ.10 లక్షల వరకు నష్టం వా టిల్లిందని తమ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎస్‌ఐ రైతులతో ఆందోళన విరమింపజేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పశువైద్య డీడీ మాలకొండయ్య, ఏడీ బెనర్జీ, రామాపురం మండల పశువైద్యాధికారి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆందోళన చేస్తున్న స్థలానికి చేరుకుని పశువులు సంచరించే ప్రదేశాలు పరిశీలించి మరణానికి సంబంధించిన విషయాలు గుర్తిస్తామని తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించి వ్యాధికి సంబంధించిన ఆధారాలను కనుగొంటామని తెలిపారు.

## వైభవంగా గొబ్బెమ్మ నిమజ్జనం

రైల్వేకోడూరు, జనవరి 19: మండలంలోని గుండాలపల్లె లో గురువారం రాత్రి గొబ్బెమ్మ నిమజ్జన కార్యక్రమం ప్రారంభించి శుక్రవారం ఉదయం 6 గంటలకు గుంజననదిలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా చెక్క భజనలు, కోలాటాలు, భజనలు చేశారు. అనంతరం ప్రసాదం పంపిణీ చేశారు.

## అర్హులకు మాత్రమే పట్టాలు ఇవ్వండి

గాలివీడు, జనవరి 19: గాలివీడు పంచాయతీ నాయునివారిపల్లెకు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిలో అర్హులైన పేదలకు మాత్రమే ఇంటి పట్టాలు మంజూరు చేయాలని స్థానికులు రెడ్డెప్పనాయుడు, శ్రీనివాసులునాయుడు, ఈశ్వర్‌నాయుడు, ప్రతాప్‌నాయుడు తదితరులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నాయునివారిపల్లెకు సమీపంలోని సర్వే నెంబర్ 796-1లో 62 సెంట్ల ప్రభుత్వ భూమిని చాలా కాలంగా స్థానికులు వ్యవసాయ సంబంధిత పనులకు వినియోగించుకుంటున్నారు. ఈ భూమిలో జగనన్న కాలనీ ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. అయితే, రెవెన్యూ అధికారులు డబ్బు తీసుకుని అనర్హులకు పట్టాలు మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. ఇదే గ్రామంలో ఎంతో మంది ఇండ్లు లేని నిరుపేదలు ఉన్నారని, వారికి ఇంటి స్థలాలు ఇవ్వలేదని తెలిపారు. రాజకీయ నాయకుల అండ ఉన్న వారికి ఒక్కొక్క కుటుంబానికి రెండు, మూడు ప్లాట్లు కేటాయిస్తున్నారని ఆరోపించారు.

## సినిమాలో మార్క్స్, లెనిన్ పేర్లు తొలగించాలి

లక్కిరెడ్డిపల్లె, జనవరి 19: సంక్రాంతి పండుగకు విడుదలైన గుంటూరు కారం సినిమాలో విలన్ పాత్రలకు మార్క్స్, లెనిన్ పేర్లు పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న తెలిపారు. శుక్రవారం ఆయన లక్కిరెడ్డిపల్లెలో విలేకర్లతో మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా శ్రామికవర్గాన్ని విముక్తి చేయడానికి తమ జీవితాన్ని ధారపోసిన వ్యక్తి కార్ల్ మార్క్స్ కాగా, కామ్రేడ్ లెనిన్ మార్క్సిజంతో రష్యాలో దోపిడీ, పీడన లేని సోషలిస్టు సమాజాన్ని సాధించాడన్నారు. డైరెక్టర్ త్రివిక్రమ్, హీరో మహేశ్‌బాబు బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పి ఆ పేర్లను తొలగించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు స్వరూప్‌తేజ, అరుణ్, మహేష్, వెంకటమహేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా చేయండి

చిట్వేలి, జనవరి19 : అంతరాయం లేని నిరంతర విద్యుత్ సరఫరాకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ ఎస్.రమణ సూచించారు. శుక్రవారం చిట్వేలి సబ్‌స్టేషన్, బాకరాపురం సబ్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లను పరిశీలించారు. అనంతరం చిట్వేలి సబ్‌స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పగటిపూట వీధి లైట్లు వెలిగితే సహించబోమని హెచ్చరించారు. వేసవి దృష్టిలో పెట్టుకొని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలని, వంగిపోయిన స్తంభాలను యుద్ధప్రాతిపదికన మార్చాలన్నారు. పొలాలకు విద్యుత్ కంచెను ఏర్పాటు చేయడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట డివిజన్ ఈఈ రాజశేఖర్‌రెడ్డి, రైల్వేకోడూరు సబ్ డివిజన్ డీఈఈ భాస్కర్‌రావు, చిట్వేలి ఏఈ వెంకటచాలపతి సిబ్బంది పాల్గొన్నారు.

## సోమశిల వెనుక జలాల్లో చేప పిల్లలు విడుదల

నందలూరు, జనవరి19 : మండలంలోని కోనాపురం గ్రామ సమీప సోమశిల వెనుక జలాల్లో అన్నమయ్య జిల్లా ఫిషరీస్ అధికారి సుస్మిత, ఎంపీపీ మేడా విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో 18.66 లక్షల చేప పిల్లలు శుక్రవారం విడుదల చేశారు. వీటిలో 8 లక్షల చేప పిల్లలు బాహుదా మత్స్య క్షేత్రం నుంచి, 2లక్షల చేప పిల్లలు రాజంపేట మత్స్య క్షేత్రయ నుంచి 1.2 లక్షల చేప పిల్లలు పీలేరు నుంచి 7.46 లక్షలు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద విజయవాడ నుంచి సేకరించారు. ఈ కార్యక్రమంలో పీలేరు డీఎఫ్‌వో మోహన్‌కృష్ణ, ఇరిగేషన్ ఈఈ కృష్ణమూర్తి, ఇన్‌చార్జి అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ సుబ్బనరసయ్య, లైసెన్సు హోల్డర్‌లు పాల్గొన్నారు.

## క్రీడల్లో దేశం గర్వించేలా రాణించాలి

చిట్వేలి, జనవరి 19: క్రీడల్లో దేశం గర్వించేలా రాణించాలని ఉపసర్పంచ్ ఉమామహేశ్వర్ రెడ్డి సూచించారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాత చిట్వేలిలో జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో పాత చిట్వేలి కె.ఎస్.అగ్రహారం జట్లు తలపడగా పాత చిట్వేలి వరదరాజుల యూత్ విజేతగా నిలిచింది. ఈ పోటీలో 14 టీంలు పోటీ పడ్డాయి. విజేత జట్టు నియోజకవర్గ స్థాయిలో పోటీ పడనుంది.

## అరటి తోటల పరిశీలన

రైల్వేకోడూరు, జనవరి 19: నియోజకవర్గ పరిధిలోని మైకోట గ్రామంలోని అరటి తోటలను శుక్రవారం అనంతరాజుపేట ఉద్యాన కళాశాల ఆచార్యులు సీహెచ్ రూత్ బెనర్జీ, కే. స్వరాజ్యలక్ష్మి విద్యార్థులు పరిశీలించారు. అరటి తోటల్లో తెగుళ్ల నివారణ, అధిక దిగుబడులకు చేపట్టాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యాన యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ పి. శ్రీలత, విద్యార్థులు నాగరాజు, మునికుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుకు సన్మానం



నారా చంద్రబాబును సన్మానిస్తున్న గాజుల ఖాదర్‌బాషా



కమలాపురంలో చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న మేడా విజయశేఖర్ రెడ్డి

రాయచోటిటౌన్, జనవరి 19: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును శుక్రవారం వెంకటగిరిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటగిరిలో జరిగిన రా కదలిరా బహిరంగ సభకు స్వచ్ఛందంగా లక్షలాది మంది ప్రజలు తరలివచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకుడు జలీల్ పాల్గొన్నారు.

## వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

పుల్లంపేట, జనవరి19 : స్థానిక పర్వతవర్ధినీదేవి శాంతి లింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీ ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహించారు. కల్యాణం అనంతరం అన్నదానం చేశారు. పెంచలకోన పాదయాత్ర సందర్భంగా నరసింహకుమార్ స్వామి ఈ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 100 మందికి పైగా భక్తులు లక్ష్మీనరసింహస్వామి మాలలు ధరించి పాల్గొన్నారు.

## ఘనంగా వేమన జయంతి

చిట్వేలి, జనవరి19 : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చిట్వేలి శాఖ ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ సిబ్బందితో కలిసి యోగి వేమన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కామాటం వెంకటేశ్వర్లు, వేమన కవితా వైభవం భాషాభివృద్ధికి చేసిన సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో మానవత బాధ్యులు సాయిరాం, మునిరావు, సభ్యులు సుధీర్‌రెడ్డి, సురేంద్ర, నవీన్, పంచాయతీ సిబ్బంది నరసింహ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఒంటిమిట్ట, జనవరి 19 : మండలంలోని సిద్దవటం, ఒంటిమిట్ట, నందలూరు పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 133కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి 5.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీ మురళీధర్‌రెడ్డి తెలిపారు. ఈ విషయం గుర్తించి వినియోగదారులు సహకరించాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

## మద్యం సీసాలు స్వాధీనం

వీరబల్లి, జనవరి 19: మండల కేంద్రం నుంచి మద్యం బాటిళ్లు తీసుకొని వెళ్తున్న కొత్తవడ్డెపల్లెకు చెందిన వ్యక్తిని గుర్రప్పగారిపల్లె సమీపంలో శుక్రవారం పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. స్థానిక వైన్ షాప్‌లో మద్యం కొనుగోలు చేసి, అధిక ధరలకు విక్రయించేందుకు తీసుకువెళుతున్నట్లు తమకు సమాచారం రావడంతో అతని వెంబడించి పట్టుకుని కేసు నమోదు చేసినట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

## ఆరుగురు జూదరుల అరెస్ట్

వీరబల్లి, జనవరి19: మండల పరిధిలోని తాటిగుంటపల్లె పంచాయతీ షికారుపాలెం సమీపంలో జూదం ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి రూ.4,900 స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి రిమాండుకు పంపినట్లు తెలిపారు.

## అధిక ధరలకు మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

నందలూరు, జనవరి19 : మండలంలోని కుంపినీపురం గ్రామానికి చెందిన కోనేటి నరసింహులు తన ఇంటి ముందు మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు ఏఎస్‌ఐ రాముడు శుక్రవారం తెలిపారు. అతని నుంచి 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## 22న గాలివీడులో శ్రీరామ శోభాయాత్ర

గాలివీడు, జనవరి19: అయోధ్యలో శ్రీరామ జన్మ మందిర ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఈ నెల 22న పట్టణంలోని గేటు వద్ద ఉన్న శ్రీరామాలయ కమిటీ ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం శ్రీరామాలయంలో ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

### కౌన్సిలర్ జయన్ననాయక్ మృతి

రాయచోటిటౌన్, జనవరి19: రాయచోటి మున్సిపాలిటీలోని 19వ వార్డు కౌన్సిలర్ జయన్ననాయక్ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న సాటి కౌన్సిలర్లు, మున్సిపల్ ఉద్యోగులు ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## కాణిపాకంలో 22న సీతారాముల కల్యాణం

ఐరాల(కాణిపాకం), జనవరి 19: కాణిపాకంలో ఈనెల 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు సీతారాముల కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు తెలిపారు. అదే రోజున అయోధ్యలో నూతన రామాలయ ప్రతిష్ఠ జరగనుండటంతో ఈ కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆలయ ఉభయదారులు, భక్తులు హాజరు కావాలని కోరారు.



ఆలయంలో కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రసన్న బి వరాలే - సినీ నటుడు చరణ్‌రాజ్

## వరసిద్ధుడి సేవలో కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి



యాంకర్ సుమ, గాయని సునీత

ఐరాల(కాణిపాకం), జనవరి 19: స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని శుక్రవారం కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రసన్న బి వరాలే దర్శించుకున్నారు. ఏఈవో హరిమాధవరెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లు చేసి, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు, సీఐ రవిశంకర్‌రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, వాసు, తహసీల్దార్ సుశీల, ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్వామిని సినీనటుడు చరణ్‌రాజ్, యాంకర్ సుమ, ప్రముఖ సింగర్ సునీత దర్శించుకున్నారు.

## శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.74 కోట్లు

తిరుమల, జనవరి19(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.74 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 62,649 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 24,384 మంది తలనీలాలు సమర్పించారు.

## గాయపడ్డ నెమలి అటవీ అధికారులకు అప్పగింత



నెమలిని అటవీశాఖ అధికారులకు అందిస్తున్న కాణిపాకం పోలీసులు

ఐరాల(కాణిపాకం), జనవరి 19: తవణంపల్లె మండలం ఈచనేరి వద్ద గాయపడ్డ నెమలిని గుర్తించిన కొందరు దాన్ని కాణిపాకం పోలీసులకు అందించారు. వారు నెమలికి అవసరమైన చికిత్సలను చేయించాక శుక్రవారం అటవీశాఖ అధికారులకు అప్పగించారు. అటవీశాఖ అధికారులు ఆ నెమలిని సురక్షితంగా అటవీప్రాంతంలో విడిచిపెట్టారు.

## గుండెపోటుతో హెచ్ఎం మృతి



భాష్యం హరి (ఫైల్ ఫొటో)

ఐరాల, జనవరి 19: ఐరాల మండలం నాంపల్లె జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు భాష్యం హరి(52) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన స్వగ్రామం పూతలపట్టు మండలం పోటుకనుమ వద్ద చిగరపల్లె. ఈయన గతంలో బీరప్పచెరువు పాఠశాలలో హెచ్ఎంగా చేస్తూ.. బదిలీపై నాంపల్లె జడ్పీ హైస్కూల్‌కు వచ్చారు. ఉదయం పాఠశాలకు వచ్చి, విధులు ముగించుకుని సాయంత్రం ఇంటికెళ్లారు. ఇంట్లో ఫోన్ మాట్లాడుతూ ఉన్నట్లుండి కుప్పకూలిపోయారు. గమనించిన కుటుంబీకులు వెంటనే పి.కొత్తకోట ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు తెలిపారు. ఈ విషయం తెలియడంతో చిగరపల్లె, నాంపల్లెల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

చిత్తూరు (సెంట్రల్), జనవరి 19: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమైనట్లు జిల్లా ఒకేషనల్ విద్యాధికారి సయ్యద్ మౌల తెలిపారు. ఫస్టియర్‌కు లాంగ్వేజ్‌తోపాటు సబ్జెక్టుల వారీగా పేపర్-1 ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండియర్‌కు లాంగ్వేజ్‌తోపాటు పేపర్-2 మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. తొలి రోజున తెలుగు, హిందీ పరీక్షలు జరిగాయని పేర్కొన్నారు. శనివారం ఇంగ్లీష్, ఈనెల 22న బోటనీ, మ్యాథ్స్-ఎ, సివిక్స్ 23న మ్యాథ్స్-బి, బయాలజీ, హిస్టరీ, 24న ఫిజిక్స్, ఎకనామిక్స్, 25న కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు జరగనున్నట్లు వివరించారు.

## భీమవరం అడవుల్లో నిమ్మనపల్లి మండలవాసి ఆత్మహత్య




పానిపూరి శివ (ఫైల్‌ఫొటో)

చంద్రగిరి, జనవరి19: చంద్రగిరి మండలం భీమవరం అడవుల్లో అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లి మండలవాసి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. భీమవరం అడవుల్లో ఓ మృతదేహాన్ని పశువుల కాపరులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం పక్కనే ద్విచక్ర వాహనం, పురుగుల మందు డబ్బా ఉంది. పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. వాహన నంబరు ఆధారంగా పోలీసులు నిమ్మనపల్లి మండలానికి చెందిన పానిపూరి శివ(49)గా గుర్తించారు. అయితే ఈనెల 11వ తేదిన పానిపూరి శివ కనిపించడంలేదని నిమ్మనపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ విషయాన్ని చంద్రగిరి పోలీసులు నిమ్మనపల్లి పోలీసులు సమాచారం ఇచ్చారు. శనివారం పోస్టుమార్టం నిర్వహించి దర్యాప్తు చేయనున్నారు.

## కఠారి దంపతుల హత్యకేసులో ఇద్దరికి బెయిల్ నిరాకరణ

చిత్తూరు లీగల్, జనవరి 19: దివంగత మేయర్ కఠారి అనురాధ దంపతుల హత్యకేసులో ఇద్దరు నిందితులకు సుప్రీంకోర్టు బెయిల్ నిరాకరించింది. కఠారి అనురాధ, మోహన్‌లు 2015 నవంబరు 17వ తేదీన నగరపాలక సంస్థ కార్యాలయంలో హత్యకు గురయ్యారు. ఈ ఘటనపై చంద్రశేఖర్ అలియాస్ చింటూతోపాటు మరో 22 మందిపై చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. వీరిలో 18మందికి రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. మిగిలినవారు ఇప్పటికీ రిమాండ్‌లో ఉన్నారు. ఇదిలా ఉండగా కొన్నేళ్లుగా తాము జైల్లో ఉన్నామని, బెయిల్ మంజూరు చేయాలంటూ ఇదే కేసులో నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏ3 జయప్రకాష్ రెడ్డి, ఏ4 మంజునాథ్‌లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు శుక్రవారం విచారణకు వచ్చింది. పూర్వాపరాలు పరిశీలించాక.. కింది కోర్టులో సాక్షుల విచారణ చివరిదశలో ఉన్నప్పుడు బెయిల్ ఇవ్వడం కుదరదంటూ ఆ పిటిషన్‌ను జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ సుధాన్షు ధులియాలు డిస్మిస్ చేశారు.

## ఫ్రైడ్ రైస్ తింటూ.. ఊపిరాడక బాలుడి మృతి



నవదీప్ (ఫైల్‌ఫొటో)

వి.కోట, జనవరి 19: వి.కోట మండలం నాగిరెడ్డిపల్లెలో మురళి కుమారుడు నవదీప్ (11).. ఫ్రైడ్ రైస్ తింటూ, ఊపిరాడక మృతి చెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. వీలేరు సమీపంలోని గ్యారెంపల్లె గురుకులంలో ఆరో తరగతి చదువుతున్న నవదీప్ సంక్రాంతి సెలవులకు స్వగ్రామానికి వచ్చాడు. శుక్రవారం తనకు ఫ్రైడ్ రైస్ కావాలని తండ్రిని అడిగాడు. ఆయన వి.కోట నుంచి ఫ్రైడ్‌రైస్‌ను తీసుకురాగా, దాన్ని తింటుండగా గొంతుపట్టుకుని.. ఊపిరాడక అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే కారులో వి.కోటకు బయల్దేరారు. మార్గమధ్యంలోనే వాంతులు చేసుకుంటూ విలవిల్లాడాడు. ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు ఆ గ్రామానికి చేరుకుని బాలుడి మృతదేహాన్ని సందర్శించి, కుటుంబీకులను ఓదార్చారు.

# బిగుస్తున్న ఉచ్చు

### దొంగ ఓట్ల కేసులో మరో ఇద్దరిపై సస్పెన్షన్ వేటు

### బోగస్ ఓట్ల వెనుక గుర్తు తెలియని వ్యక్తులున్నారంటూ కమిషనర్ ఫిర్యాదు

### ఫిర్యాదులో ముగ్గురు కంప్యూటర్ ఆపరేటర్ల పేర్లు

### అసలు సూత్రధారుల పేర్లు బయటకు రాకుండా భారీ ప్రయత్నాలు





సస్పెండైన తిరుపతి కలెక్టరేట్ ఏవో ఎం.జయరాములు, విజయభాస్కర్

తిరుపతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి దొంగ ఓట్ల కుంభకోణంలో డొంక కదులుతోంది. తొలి వేటు ఐఏఎస్ అధికారి గిరీషా మీద పడగా మలి వేటు ఒక తహసీల్దారు, మరొక డిప్యూటీ తహసీల్దారు మీద పడింది. తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల విధుల్లో ఉన్న మిగిలిన అధికారుల మీద కూడా చర్యలు తప్పవనే ప్రచారం జరుగుతోంది.అయితే అసలు సూత్రధారుల పేర్లు బయటకు రాకుండా ఉండేందుకు అప్పుడే ఢిల్లీ స్థాయిలో ప్రయత్నాలు జరుగుతున్నట్టు చెబుతున్నారు. అందులో భాగంగానే ముగ్గురు కంప్యూటర్ ఆపరేటర్ల మీద పోలీసులకు ఫిర్యాదు చేశారని భావిస్తున్నారు. మరోవైపు వైసీపీ నేతల ఆదేశాలకు అనుగుణంగా విచ్చలవిడిగా ఉప ఎన్నికల విధులు నిర్వహించిన పోలీసు అధికారులు ఎన్నికల కమిషన్ కొరడా తమ మీదకు మళ్లకముందే సర్దుబాటు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఉప ఎన్నికల్లో తిరుపతి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో వున్న మూడు అసెంబ్లీ నియోజకవర్గాలైన తిరుపతికి ఆర్వోగా మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, ఏఆర్వోగా అర్బన్ తహసీల్దార్ జయరాములు, శ్రీకాళహస్తి ఆర్వోగా గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు (జీఎన్ఎస్ఎస్) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం. శ్రీనివాస్, సత్యవేడు ఆర్వోగా డ్వామా పీడీ చంద్రశేఖర్ వ్యవహరించారు. తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ గిరీష ఈఆర్వోగా ఉన్నారు. ఆ సమయంలో ఈఆర్వో లాగిన్ నుంచి దాదాపు 34వేల ఎపిక్ కార్డులు డౌన్‌లోడ్ చేసి దొంగ ఓటరు కార్డులను సృష్టించినట్టు ఈసీ గుర్తించింది. దేశంలోనే అతిపెద్ద ఎన్నికల నేరంగా భావించి వెంటనే చర్యలకు ఉపక్రమించింది.ఈఆర్వోగా వ్యవహరించిన ప్రస్తుత అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషాను సస్పెండ్ చేసింది. ఆ తర్వాతి వేటు ఉప ఎన్నికల సమయంలో ఏఆర్వోగా పనిచేసి ప్రస్తుతం కలెక్టరేట్‌లో ఏవోగా ఉన్న అర్బన్ తహసీల్దార్ జయరాములు మీదా, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసి, ప్రస్తుతం పుత్తూరు డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న ఎం. విజయభాస్కర్‌లపై పడింది. ఈ ఇద్దరినీ కేంద్ర ఎన్నికల సంఘం సస్పెండ్ చేసింది. అప్పట్లో ఎన్నికల విధుల్లో ఉన్న మిగిలినవారి మీద కూడా తదుపరి చర్యలుంటాయనే ప్రచారం జరుగుతోంది. అప్పటి ఆర్డీవో కనకనరసా రెడ్డి పైన కూడా చర్యలు తప్పవనే ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే ఉప ఎన్నిక ఓట్ల అవకతవకలతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన మీడియాకు వివరణ ఇచ్చుకున్నారు. అదేవిధంగా తిరుపతికి ఆర్వోగా పనిచేసిన మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డిపై కూడా త్వరలో వేటు పడనున్నట్టు అధికారవర్గాల్లో చర్చ జరుగుతోంది.

#### చిట్టెలుకలను ఇరికించే కుట్రా?

ఇదిలావుంటే ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు ఒరిజినల్ ఎపిక్ (ఎలక్షన్ ఫొటో ఐడెంటిటీ)కార్డులను అక్రమంగా డౌన్‌లోడ్ చేసి, వాటి స్థానంలో నకిలీ ఎపిక్ కార్డులు రూపొందించారంటూ ఈనెల 7వ తేదీన తిరుపతి ఈస్టు పోలీసులకు కార్పొరేషన్ కమిషనర్ హరిత ఫిర్యాదు చేయడం చర్చగా మారింది.ఆ సమయంలో తిరుపతి అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా ఉన్న కంప్యూటర్ ఆపరేటర్లు ప్రతాప నాయక్, సి.శివకుమార్, జి. విజయకుమార్‌లను ప్రాథమికంగా తాను విచారించానని, అయితే వారు తమ పాత్ర ఉన్నట్టు అంగీకరించలేదని హరిత ఫిర్యాదులో పేర్కొన్నారు.సాంకేతికపరమైన పరిజ్ఞానంతో లోతైన విచారణ చేపట్టాలని ఆమె కోరారు కూడా. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఐటీ చట్టం మేరకు విచారణకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. అయితే ఇదంతా కిందిస్థాయి ఉద్యోగులను బలిపశువులుగా చేసే కుట్రగా కనిపిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కేవలం ముగ్గురు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు 34 వేల కార్డులను తమకై తాము డౌన్‌లోడ్ చేసేంత సాహసం ఎందుకు చేసి ఉంటారనే ప్రశ్న బలంగా వినిపిస్తోంది. వీరికి పై అధికారుల నుంచి ఒక వేళ ఆదేశాలున్నా.. రాజకీయ నేతల ప్రమేయం లేకుండా ఇదంతా జరిగే అవకాశమే లేదంటున్నారు. తిరుపతి కేంద్రంగా ప్రముఖ రాజకీయ నేతల కార్యాలయంలో ఈ దొంగ వ్యవహారం అంతా జరిగిందనే ప్రచారం నేపథ్యంలో.. దృష్టి మళ్లించడానికే ముగ్గురు కంప్యూటర్ ఆపరేటర్ల పేర్లతో హడావుడిగా ఫిర్యాదు చేశారని అంటున్నారు. ఎన్నికలు ముంచుకు వస్తున్న వేళ ప్రజల అనుమానాలు తమ మీదకు మళ్లకుండా ముఖ్య నేతలు భారీస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారని చెబుతున్నారు.

#### ప్లీజ్.. ప్లీజ్ .. సంతకం పెట్టండి : పోలీసుల వేడుకోలు

ఇదే సమయంలో ఉప ఎన్నికల విధులు నిర్వహించిన పోలీసు అధికారుల గుండెల్లో గుబులు మొదలైంది. తిరుపతి ఉప ఎన్నికల్లో జరిగిన అవకతవకలపై తనకేమీ సంబంధం లేదన్నట్టుగా సంతకం చేయమంటూ అప్పటి అలిపిరి సీఐ దేవేంద్రకుమార్ టీడీపీ ఎంపీ అభ్యర్థి పనబాక లక్ష్మిని గురువారం కోరినట్టు చెబుతున్నారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ నివాసంలో మీడియా సమావేశంలో పనబాక లక్ష్మి ఉండగా సీఐ అక్కడకు చేరుకుని అభ్యర్థించారని చెబుతున్నారు. ఉప ఎన్నికల వేళ దొంగ ఓట్లు వేసినవారిపై ఆధారాలతో సహా పనబాక లక్ష్మి ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. అయితే ఆమె ఫిర్యాదులో పేర్కొన్నవారు తమ విచారణలో అసలైన ఓటర్లు అని తేలిందని అంగీకరిస్తున్నట్టు సంతకం పెట్టాలని సీఐ ఆమెను కోరారని తెలుస్తోంది. దీనిపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన ఆమె, సంతకం పెట్టకుండా తిప్పి పంపారంటున్నారు. ఇక మరి కొందరు పోలీసు అధికారులు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వద్దకు పరుగులు తీసినట్టు చెబుతున్నారు. ఎలాగైనా తమను కాపాడాలంటూ వేడుకున్నారని అంటున్నారు. ఆయన మాత్రం, కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల విషయంలో తానేమీ జోక్యం చేసుకోలేనని తేల్చి చెప్పేశారని తెలుస్తోంది. దీంతో నాయకుల ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరించిన పోలీసులు తల్లడిల్లుతున్నట్టు చెబుతున్నారు.

## ముందస్తు బెయిల్ కోసం హైకోర్టుకు రామచంద్రయాదవ్

### వివరాలు సమర్పించాలని పోలీసులను ఆదేశించిన హైకోర్టు

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ధర్మ పోరాట సభ ఏర్పాటు ఘటనలో పుంగనూరు పోలీసులు తనపై నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ దాఖలు చేసిన పిటిషన్ శుక్రవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు సమర్పించాలని న్యాయస్థానం పోలీసులను ఆదేశించింది. విచారణను వారం రోజుల పాటు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జగడం సుమతి శుక్రవారం ఆదేశాలు ఇచ్చారు.

## ఆర్డీవో ముందు హాజరుకండి
## నోటీసుపై మీ అభ్యంతరాలు చెప్పండి

### బీసీవైపీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్‌కు హైకోర్టు ఆదేశం

### 24 వరకు ఆయనపై ఎలాంటి కఠినచర్యలు తీసుకోవద్దు

### ఆర్‌డీవో, పుంగనూరు ఎస్‌హెచ్‌వోకు స్పష్టీకరణ

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): తన ముందు హాజరు కావాలని కోరుతూ సీఆర్పీసీ సెక్షన్ 110 కింద పలమనేరు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ ఇచ్చిన నోటీసును సవాల్ చేస్తూ భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. రామచంద్రయాదవ్‌పై ఈ నెల 24 వరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ఆర్‌డీవో, పుంగనూరు ఎస్‌హెచ్‌వోను ఆదేశించింది. అయితే ఆర్‌డీవో ముందు హాజరై నోటీసులు ఇవ్వడంపై అభ్యంతరాలు తెలియజేయాలని పిటిషనర్‌కు సూచించింది. విచారణను ఈ నెల 24కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జగడం సుమతి శుక్రవారం ఆదేశాలిచ్చారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ఎన్.అశ్వనీకుమార్ వాదనలు వినిపించారు. కేవలం రాజకీయ కక్షతో పిటిషనర్‌కు సీఆర్పీసీ సెక్షన్ 110 కింద నోటీసులు జారీ చేశారన్నారు. సంబంధిత సెక్షన్ కింద నోటీసు ఇవ్వడానికి గల కారణాలను అందులో పేర్కొనలేదన్నారు. పిటిషనర్‌ను అరెస్ట్ చేస్తారనే ఆందోళన ఉందన్నారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ... ఈ నెల 20న విచారణకు హాజరు అవుతాన ని పిటిషనర్ సమాచారం ఇచ్చారన్నారు. నోటీసుపై పిటిషనర్ తన అభ్యంతరాలను ఆర్డీవో ముందు వ్యక్తపరచవచ్చన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.... ఆర్‌డీవో ముందు హాజరై నోటీసులు ఇవ్వడంపై అభ్యంతరాలు తెలియజేయాలని పిటిషనర్‌కు సూచించింది. ఈ నెల 24 వరకు పిటిషనర్‌పై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ఆర్‌డీవో, పుంగనూరు ఎస్‌హెచ్‌వోను ఆదేశించారు.

# పుంగనూరులో సినీ సంక్రాంతి



విజేతకు నగదు బహుమతి అందజేస్తున్న సినీనటి తమన్నా

పుంగనూరు, జనవరి 19: వచ్చే ఏడాది సంక్రాంతి పండుగకు పుంగనూరుకు వచ్చి అందరినీ కలిసి సంస్కృతి, సంప్రదాయాలు పూర్తిగా తెలుసుకుంటానని ప్రముఖ సినీనటి తమన్నా అన్నారు. పుంగనూరుకు శుక్రవారం తమన్నా రావడంతో పట్టణంలో సందడి నెలకొంది. బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలను లక్కీడిప్ ద్వారా ఎంపిక చేయగా.. బహుమతులను యాంకర్ సుమ, సినీగాయని సునీతలతో కలిసి తమన్నా ప్రదానం చేశారు.

#### వచ్చే ఏడాది భారీగా నిర్వహిస్తాం రామచంద్రయాదవ్

భగవంతుడు ఆశీర్వదిస్తే వచ్చే ఏడాది సంక్రాంతి సంబరాలను రాష్ట్రంలో ఎక్కడా జరగని విధంగా భారీ ఎత్తున పుంగనూరులో నిర్వహిస్తామని రామచంద్ర యాదవ్ తెలిపారు. వచ్చే ఏడాదిలో మహిళలకు ముగ్గుల పోటీలు, రైతులకు ఎద్దుల పోటీలు, యువతకు కబడ్డీ పోటీలు నిర్వహిస్తామని వివరించారు.

#### భారీగా విజేతలకు బహుమతులు

పుంగనూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలు, మున్సిపాలిటీలతో కలిపి మొదటి బహుమతిగా ఏడుగురికి ఒక్కొక్కరికి రూ.50,116 చొప్పున నగదు బహుమతులు అందజేశారు. వీరిలో.. పుంగనూరు టౌన్ నుంచి ఆర్.వసంతకుమారి, పుంగనూరు మండలం నుంచి జె.లోహిత, చౌడేపల్లె మండలం నుంచి ఆర్.కుసుమ, సోమల మండలం నుంచి చిన్నరెడ్డెమ్మ, సదుం మండలం నుంచి డి.అనసూయ, పులిచెర్ల మండలం నుంచి ఎం.హేమలత, రొంపిచెర్ల మండలం నుంచి రెడ్డిరేణుక ఉన్నారు. ద్వితీయ బహుమతులుగా మండలానికి ముగ్గురు చొప్పున మొత్తం 21మందికి రూ.25,116, తృతీయ బహుమతిగా మండలానికి తొమ్మిది మంది చొప్పున మొత్తం 63మందికి రూ. 5,116 చొప్పున నగదు అందజేశారు. అలాగే పోటీలో పాల్గొన్న 400 మంది మహిళలకు సంక్రాంతి ప్రత్యేక కానుకలు అందించారు. బీసీవైపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

## డీసీసీబీలో వడ్డీపై వడ్డీ మాఫీ



సమావేశంలో ప్రసంగిస్తున్న రెడ్డెమ్మ

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 19: రైతులు తీసుకున్న రుణాలు వాయిదా మీరి ఉంటే వాటిని మార్చి నెలాఖరులోగా చెల్లిస్తే వడ్డీపై వడ్డీ, అపరాధపు వడ్డీ మాఫీ, వడ్డీ రాయితీ పొందే సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) ఛైర్‌పర్సన్ రెడ్డెమ్మ ప్రకటించారు. స్థానిక బ్యాంకు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె ప్రసంగించారు. వడ్డీ మాఫీ కారణంగా బ్యాంకుపై రూ.కోటి అదనపు భారం పడుతుందని, రైతాంగం కోసం దాన్ని మోసేందుకు సిద్ధమన్నారు. రూ.వెయ్యి కోట్ల డిపాజిట్లు సేకరించాలన్న లక్ష్యంలో ఇంతవరకు రూ.850 కోట్లు వృద్ధి సాధించామని చెప్పారు. సీఈవో మనోహర్ గౌడ్ అజెండాలోని అంశాలను సభ్యులకు వివరించారు. బ్యాంకు పరిధిలోని ఉద్యోగుల సర్వీసు రెగ్యులరైజేషన్ అమలు చేయాలని పాలకవర్గం నిర్ణయించిందన్నారు. రైతాంగం నుంచి వస్తున్న అభ్యర్థనలతో సింగిల్ విండోల ద్వారా ఇస్తున్న రుణపరపతిని మరింత పెంచుతున్నట్లు వెల్లడించారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు, సీడీసీఎంఎస్ అధ్యక్షులు నాగలక్ష్మి, ప్రింటింగ్ ప్రెస్ అధ్యక్షుడు మురళీమోహన్ రెడ్డి, డీసీవో బ్రహ్మానందరెడ్డి, డీఎల్‌సీవో వనజ, సింగిల్ విండో పర్సన్ ఇన్‌చార్జి కమిటీ అధ్యక్షులు, బ్యాంకు, సహకార శాఖ అధికారులు పాల్గొన్నారు.

## టీటీడీ డిగ్రీ కళాశాలలకు స్వయం ప్రతిపత్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 19 : టీటీడీ తిరుపతిలో నిర్వహిస్తున్న మూడు డిగ్రీ కళాశాలలు స్వయం ప్రతిపత్తి (అటానమస్ స్టేటస్) పొందినట్లు జేఈవో సదాభార్గవి వెల్లడించారు. తిరుపతి పద్మావతి గెస్ట్ హౌస్‌లో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ, పద్మావతి డిగ్రీ కాలేజీ, ఎస్జీఎస్ కాలేజీలకు యూజీసీ పదేళ్ల పాటు అటానమస్ హోదా కల్పించిందన్నారు. టీటీడీ పాటిస్తున్న విద్యా ప్రమాణాల వల్లే ఇది సాధ్యమైందన్నారు. ఈ హోదాతో కళాశాలల అభివృద్ధి, ప్రమాణాలు, స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవడానికి మరింత అవకాశం కలుగుతుందన్నారు. ఎప్పటికప్పుడు సిలబస్‌లో మార్పు చేర్పులు చేసుకుంటూ విద్యార్థులకు ఉన్నత ఉపాధి అవకాశాలు దక్కించుకునేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం స్వయం ప్రతిపత్తి హోదా పొందిన మూడు డిగ్రీ కాలేజీలు న్యాక్ గ్రేడింగ్ కూడా గతంలోనే పొందినట్టు చెప్పారు. ఈ సమావేశంలో టీటీడీ డీఈవో భాస్కర్‌రెడ్డి, టీటీడీ విద్యా సలహాదారు డాక్టర్ ఎల్ఆర్ మోహన్‌కుమార్‌రెడ్డి, టీటీడీ చీఫ్ పీఆర్వో డాక్టర్ టి.రవి, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు. టీటీడీ డిగ్రీ కాలేజీలు స్వయం ప్రతిపత్తి హోదా పొందడం పట్ల టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

## తిరుపతికి వెల్‌నెస్ సెంటర్ మంజూరు

తిరుపతి (రవాణా), జనవరి 19: తిరుపతికి వెల్‌నెస్ సెంటర్ మంజూరైంది. కేంద్ర ప్రభుత్వ వర్కింగ్, విశ్రాంత ఉద్యోగులకు తిరుపతిలో ఆరోగ్య కేంద్రం లేదు. సెంట్రల్ గవర్నమెంట్ రిటైర్డ్ అండ్ సర్వింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ కోఆర్డినేషన్ కన్వీనర్లు దామోదరం, రంగయ్య సహకారంతో హెల్త్ కేంద్రం ఏర్పాటు ఆవశ్యకత గురించి ఎంపీ గురుమూర్తి కేంద్ర ప్రభుత్వంతో పలు దఫాలు చర్చించారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్‌స్కీమ్ (సీజీహెచ్ఎస్) కింద వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. భవనాల పరిశీలనకు హైదరాబాద్ నుంచి సీజీహెచ్ఎస్ అడిషనల్ డైరెక్టర్ లక్ష్మయ్య బృందం తిరుపతికి చేరుకుంది. నగరంలోని బీఎస్ఎన్ఎల్, పద్మావతి ఆస్పత్రి, రుయా, ఈఎస్ఐ ఆస్పత్రులను పరిశీలించింది. ఉన్నతాధికారులతో చర్చించి ఎక్కడ ఏర్పాటు చేయాలనే దానిపై నిర్ణయం తీసుకోనున్నారు. ఈ కేంద్రం ఏర్పాటుతో కేంద్ర ప్రభుత్వ, విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఆరోగ్య పరీక్షల కోసం బెంగళూరు, చెన్నై తదితర సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండాపోతుంది.

## ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్‌గా చాముండేశ్వరి



చిత్తూరు (సెంట్రల్), జనవరి 19: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్‌గా ఎ.చాముండేశ్వరీ నియమితులయ్యారు. కర్నూలు జిల్లా సమగ్రశిక్షలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న ఈమెకు ఏడీ పదోన్నతి కల్పిస్తూ ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్‌గా నియమిస్తూ చిత్తూరుకు బదిలీ చేశారు. ఈ మేర కు శుక్రవారం ఆమె బాధ్యతలు చేపట్టారు. ఇదిలా ఉండగా ఇప్పటివరకు ఇన్‌చార్జిగా వ్యవ హరించిన పరీక్షల విభాగం సహాయ కమిషనర్ గురుస్వామిరెడ్డి తన విభాగానికే పరిమితం కానున్నారు.

## ఆరు కిలోల గంజాయి స్వాధీనం

### మహిళ అరెస్టు



నిందితురాలి వివరాలు తెలియజేస్తున్న పోలీసులు

చిత్తూరు, జనవరి 19: ఆరు కిలోల గంజాయిని ఒకటో పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకుని, ఓ మహిళను అరెస్టు చేశారు. వివరాలను సీఐ ఉలసయ్య మీడియాకు తెలిపారు. రహస్య సమాచారంతో శుక్రవారం కట్టమంచి ఆటోస్టాండ్ వద్ద పెనుమూరు మండలం పూనేపల్లికి చెందిన షాహీనా(35)ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆమె వద్ద నుంచి ఆరు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈమె వైజాగ్ నుంచి కొంతమంది వ్యక్తుల ద్వారా గంజాయిని కొనుగోలు చేస్తోంది. తర్వాత దాన్ని చిత్తూరులోని ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్, పాతబస్టాండు, గంగినేనిచెరువు, పీవీకేఎన్ కళాశాల తదితర ప్రాంతాల్లో అధిక ధరలకు అమ్ముతున్నట్లు విచారణలో గుర్తించారు. దాంతో నిందితురాలిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఎస్ఐలు మల్లికార్జున్, భారతి పాల్గొన్నారు.

## అదృశ్యమైన వ్యక్తి ఆత్మహత్య



సాంబశివ (ఫైల్‌ఫోటో)

నిమ్మనపల్లి, జనవరి 19: ఇంటి నుంచి ఎవ్వరికి చెప్పకుండా వెళ్లిపోయి అదృశ్యమైన వ్యక్తి ఆత్మహత్య చేసుకొన్నట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం కల్లూరు అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకొని ఓ వ్యక్తి మృతి చెందాడని అక్కడ గొర్రెలకాపరు లు గమనించి సమాచారాన్ని పోలీసులకు తెలపడంతో వారు మృతుని వివరాలతో పాటు ద్విచక్రవాహనాన్ని పరిశీలించి చని పోయిన వ్యక్తి కందిరీగుల సాంబశివ(55)గా నిర్ధారించారు. వెంటనే కుటుంబీకుల సమా చారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి వెళ్లిన కుటుంబీకులు మృతదేహన్ని పరిశీలించగా సాంబశివ మృతదేహంగా గుర్తించారు. దీంతో మృతుని భార్య హేమావతి, కుమార్తె రాజేశ్వరి. బంధువులు భోరునవిలపించారు. కాగా సాంబశివ ఈ నెల10వ తేదీ ఇంటి నుంచి ఎవ్వరికీ చెప్పకుండా వెళ్లిపోయాడని దీంతో స్థానిక పోలీసులకు పిర్యాదు చేశామన్నారు. సాంబశివ ఎక్స్‌క వేటర్‌లు పెట్టుకొని జీవనం కొనసాగిస్తూ పానీపూరి బండి నిర్వహించే వాడు. సాంబశివ అప్పుల బాధ తాళలేక మృతి చెందినట్లు తెలుస్తోంది.

## 8మంది కోడిపందెంరాయుళ్ల అరెస్ట్

నిమ్మనపల్లి, జనవరి 19: గుట్టు చప్పుడు కాకుండా కోడిపందేలు ఆడుతున్న 8మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రెండు పందెం కోళ్లతో పాటు నగదు స్వాధీనం చేసుకొన్నట్లు హెడ్ కానిస్టేబుల్ శివరాయకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని వెంగలకురవపల్లె సమీపంలో కోడి పందేలు ఆడుతున్న రవి, మణికుమార్, మహేష్, తాహీర్, శివకుమార్, వెంకటరమణ, రాయచంద్ర, వెంకటస్వామిలను పట్టుకొని వారివద్ద నుంచి రెండు కోళ్లతోపాటు రూ.3350లను స్వాధీనం చేసుకొని రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

## వ్యక్తిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన గుర్తు తెలియని వ్యక్తులు

మదనపల్లె టౌన్, జనవరి 19: తాగిన మైకంలో ఉన్న ఓ వ్యక్తిపై గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి నిప్పంటించారు. శుక్రవారం పట్టణ శివారులోని బసినికొండ వద్ద టేకులపాలెంకు చెందిన రామకృష్ణ కుమారుడు కేశవ(48) మద్యం మత్తులో అల్లరి చేస్తున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు అతడిని వారించినా వినకుండా అల్లరి చేస్తున్నాడు. ఈ క్రమంలో ఏమి జరిగిందో ఏమో కాని పక్కనే ఉన్న సందులో మంటల్లో కాలిపోతూ కేశవ పడిపోయాడు. విషయం తెలుసుకున్న స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించగా సిబ్బంది అక్కడికి చేరుకుని తీవ్రంగా గాయపడిన కేశవను మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి వుంది.

## సారా స్వాధీనం - ఒకరి అరెస్టు

పెద్దమండ్యం, జనవరి 19: పెద్దమండ్యం మండలం ఎన్‌వోపల్లి గ్రామ పరిధిలోని కోతిరాతిగుట్ట వద్ద శుక్రవారం నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు చేసి 40 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయుడు వెల్లడించారు. అలాగే నాటుసారా తయారీ తయారీకి సిద్ధం చేసి ఉన్న సుమారు 200 నాటుసార తయారీ బెల్లం ఊటను ధ్వంసం చేసి, 40 లీటర్ల నాటుసారాతోపాటు ఎన్‌వో పల్లికు చెందిన సహదేవ నాయక్(26)ను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌కు పరామర్శ



కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి

ములకలచెరువు, జనవరి 19: ములకలచెరువు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, పీటీఎం మండల మాజీ జడ్పీటీసీ సభ్యుడు బూర్లపల్లె కృష్ణారెడ్డిని శుక్రవారం తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత, ప్రముఖ పారిశ్రామికవేత్త దాసరిపల్లె జయచంద్రారెడ్డి పరామర్శించారు. తీవ్ర అస్వస్థతకు గురైన కృష్ణారెడ్డిని కుటుంబ సభ్యులు బెంగళూరులోని సెయింట్ జాన్స్ ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. ఈ క్రమంలో నియోజకవర్గ టీడీపీ నేత జయచంద్రారెడ్డి బెంగళూరుకు వెళ్లి పరామర్శించి వారి కుటుంబసభ్యులకు భరోసా ఇచ్చారు. వైద్యులను అడిగి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. ఆయన వెంట మంత్రి గిరిధర్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

## నిబంధనలు పాటించకుంటే చర్యలు

పీలేరు, జనవరి 19: ట్రా ఫిక్ నిబంధనలు పాటిం చకుంటే కఠిన చర్యలు తప్పవని పీలేరు అర్బన్ సీఐ మోహన్‌రెడ్డి హెచ్చ రించారు. పీలేరు పట్ట ణంలో శుక్రవారం ఆయన ట్రాక్టర్ డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజుల్లో రికార్డులను అప్‌డేట్ చేసుకోకుంటే ఆర్టీఏ అధికారులతో కలిసి దాడులు నిర్వహించి జరిమానాలు విధిస్తామన్నారు. అనంతరం ఆయన ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు అంటించారు. పోలీసు సిబ్బంది విజయ్, నాగేంద్ర నాయక్, రవికుమార్, శివ, సురేశ్, పాల్గొన్నారు.

## సురక్షతో మెరుగైన వైద్యం

తంబళ్లపల్లె, జనవరి 19: ఆరోగ్య సురక్ష వల్ల పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని డీఎంహెచ్‌వో కొండయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కుక్కరాజుపల్లెలో నిర్వహించిన రెండో విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో డీఎంహెచ్‌వో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.



# సమస్యలు పరిష్కరించేలా చూడండి

● రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ద్వారా అంగన్వాడీల వేడికోలు ● 39వ రోజు కొనసాగిన సమ్మె





బి.కొత్తకోటలో అంబేడ్కర్ చిత్ర పటం వద్ద అంగన్వాడీల నిరసన

మదనపల్లెలో నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు

మదనపల్లె టౌన్, జనవరి 19: అంగన్వాడీల సమస్యలపై 39 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న స్పందించని సీఎం జగన్ సమస్యలు పరిష్కరించేలా చూడాల రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ద్వారా అంగన్వాడీలు వేడుకున్నారు. శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాల యం వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి అంగన్వాడీలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్మా , షోకాజ్ నోటీసులకు భయపడకుండా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వానికి ఇంకా బుద్ధిరాలేదన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ అసోసియేషన్ నాయకురాళ్లు, సెక్టార్ లీడర్లు పాల్గొన్నారు.

**తంబళ్లపల్లెలో:** అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రతినిదులు సులోచన, ఉమాదేవి, గౌరి, కరుణశ్రీ డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి 39వ రోజుకు చేరుకుంది. సమ్మెలో బాగంగా అంగన్వాడీలు స్థానిక మూడు రోడ్ల కూడలిలో బైఠాయించి తమ డిమాండ్లు పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎన్నికల ముందు సీఎం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట మండలాల అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

**వాల్మీకిపురంలో:** విధులలో చేరకపోతే ఉద్యోగాల నుంచి తొలగించే దిశగా చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులు బెదిరిస్తున్నా ఏమాత్రం తగ్గేదే లేదని వాల్మీకిపురంలో అంగన్వాడీ కార్యకర్తలు ధ్వజమెత్తారు. 39వరోజు స్థానిక దీక్షా శిబిరంలో ఉన్న పలువురికి ప్రాజెక్టు అధికారులు ఫోన్ చేయడంతో యూనియన్ లీడర్లు కార్యాలయానికి వెళ్లి సీడీపీవో భారతితో మాట్లాడారు. తమను తొలగించినా సరే సమ్మె విరమించే ప్రసక్తే లేదని అంగన్వాడీలు తేల్చి చెప్పారు. అదే సమయంలో ప్రాజెక్టు అధికారులు విలేకర్లతో మాట్లాడుతూ పై అధికారుల ఆదేశాల మేరకు శనివారం మధ్యాహ్నంలోపు అంగన్వాడీ కార్యకర్తలు విధులలో చేరని పక్షంలో రోస్టర్ పద్ధతిన తొలగించి వేరే వారిని నియమించేలా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

### అంబేడ్కర్ విగ్రహానికి వినతి

వాల్మీకిపురం ప్రాజెక్టు కార్యాలయం నుంచి శుక్రవారం అంగన్వాడీ కార్యకర్తలు ర్యాలీగా పాత బస్టాండులోని అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుని విగ్రహానికి వినతిపత్రం అందజేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూనియన్ లీడర్లు చంద్రావతి, భూకైలేశ్వరి, అమ్మాజీ, ప్రసన్న, దేవసేన, లక్ష్మీనరసమ్మ, రెడ్డిరాణి, గుర్రంకొండ, కలికిరి, వాల్మీకిపురం మండలాల అంగన్వాడీలు పాల్గొన్నారు.

**బి.కొత్తకోటలో:** బి.కొత్తకోట కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 39వ రోజుకు చేరింది. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేలా ఆశీర్వదించాలని అంబేడ్కర్‌కు అంగన్వాడీ కార్యకర్తలు మొక్కుకున్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు యూనియన్ నాయకురాలు శ్రీవాణి మాట్లాడుతూ. అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మెను రాష్ట్ర ప్రభుత్వం చాలా తేలిగ్గా తీసుకుంటోందని దీని పర్యావసానం తర్వాత ప్రభుత్వానికి తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో బి.కొత్తకోట, ములకలచెరువు, పీటీయం మండలాల అంగన్వాడీలు పాల్గొన్నారు.

# వైసీపీ అరాచక పాలనకు చరమ గీతం పాడండి

●జయహో బీసీ సదస్సులో శంకర్‌యాదవ్ పిలుపు



జయహో బీసీ సదస్సులో మాట్లాడుతున్న శంకర్‌యాదవ్

బి.కొత్తకోట, జనవరి 19: రాబోయే ఎన్నికలలో వైసీపీ అరాచక పాలనకు చమరగీతం పాడాలని తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జ్ శంకర్‌యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం బి.కొత్తకోట నగర పంచాయతీలో జయహో బీసీ సదస్సు అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో శంకర్‌యాదవ్ మాట్లాడుతూ తన హయాంలో రూ.2వేల కోట్లతో తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని చెప్పారు. అయితే తంబళ్లపల్లెలో ఇప్పటి ఎమ్మెల్యే ఇసుక తవ్వకాలు, గ్రానైట్ రవాణాతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 1000 ఎకరాలు అక్రమ పద్ధతిలో బినామీల పేర్లతో సమీకరించారని ఆరోపించారు. వైసీపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే కబ్జా చేసిన భూములను తిరిగి పేద రైతులకు ఇచ్చేయాలన్నారు. వైసీపీ సినిమా అయిపోయిందని రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వస్తాయా..ఎప్పుడెప్పుడు వైసీపీని ఇంటికి పంపుదామా.. అని జనం ఎదురుచూస్తున్నారన్నారు. టీడీపీ కార్యకర్తలకు తాను ఎల్లపుడు అందుబాటులో ఉంటానని భరోసానిచ్చారు. బీసీలు అందరూ కలసి కట్టుగా తెలుగుదేశం పార్టీకి అండగా నిలవండి. పార్టీ మీకు అండగా ఉంటుందని శంకర్ యాదవ్ పిలుపునిచ్చారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్ తాజ్ మాట్లాడుతూ..బీసీలకు ఎపుడు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుదన్నారు. తంబళ్లపల్లెలో టీడీపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా అందరం కలసికట్టుగా పనిచేద్దామని కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుడుం శ్రీనివాసులు, మండల పార్టీ కన్వీనర్లు నారాయణ స్వామిరెడ్డి ఆనందరెడ్డి, జిట్లా వెంకట్రమణ, పాలగిరి సిద్ధ, మండల ప్రధాన కార్యదర్శి దేవరింటి కుమార్, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎండీ మస్తాన్, సుకుమార్, సురేంద్ర, రాఘూంజి, కుడుము శంకర్, రంజిత్, మొటుకు శివ, జనసేన నాయకులు పోతుల సాయినాథ్, చింతల కిరణ్, నాగరాజు, మాన్ల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## 'రా...కదిలిరా' సభా స్థలి పరిశీలన



నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డితో మాట్లాడుతున్న జగన్మోహనరాజు

పీలేరు, జనవరి 19: పీలేరులో జరగనున్న 'రా...కదిలిరా' బహిరంగ సభా స్థలాన్ని పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నల్లారి కిశోర్ కుమార్ రెడ్డితో కలిసి రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్మోహన రాజు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ ఈ నెల 24న చంద్రబాబు నాయుడు బహిరంగ సభను రాజంపేట పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని ప్రజలు, టీడీపీ శ్రేణులు, నంద మూరి అభిమానులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు.

## అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ

మదనపల్లె అర్బన్, జనవరి 19: అయోధ్య రాముని అక్షింతలను శుక్రవారం బీజేపీ నాయకులు పట్టణంలో ఇంటింటికి పంపిణి చేశా రు. ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్రకార్యవర్గ సభ్యుడు వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎల్లంపల్లె ప్రశాంత్, ఆకుల కృష్ణమూర్తి, మాజీ పట్టణ అధ్యక్షుడు బర్నేపల్లె రవికుమార్‌లు అక్షింతలు ఊరేగింపుగా తరలిస్తూ ప్రజలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ భగవాన్, జర్మనీరాజు, వర్షిత్, నాగరాజు, పాల్గొన్నారు.

## మల్లయ్యకొండ పనులకు బహిరంగ వేలం

తంబళ్లపల్లె, జనవరి 19: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండ దేవస్థానానికి సంబంధించి మహాశివరాత్రి ఉత్సవాలలో వివిధ హక్కులను పొందడానికి ఈ నెల 20న (శనివారం) దేవస్థానం ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఈవో రమణ, చైర్మన్ కేఆర్‌మల్‌రెడ్డి తెలిపారు. తలనీలాలు పొగుచేసుకునే హక్కుకు రూ.లక్ష, వాహనాల టోల్‌గేట్‌కు రూ.లక్ష, గౌరమ్మ గుడి ,రూ.50 వేలు, ఏనుగుమల్లమ్మ గుడి రూ.50 వేలు, వీరన్నగెవికి రూ.10వేలు, పూజా సామగ్రి హక్కు రూ..50 వేలు, కొండపైన దుకాణాలు గేట్‌కు రూ.50 వేలు ధరావత్తు చెల్లించి వేలం పాటల్లో పాల్గొనవచ్చని తెలిపారు.

## మేధస్సును పెంపొందించుకోవాలి

కలకడ, జనవరి 19:విద్యార్థులు మేధస్సులు పెంపొందించుకోవడంతో ట్యాబులు ఉపయోగకరంగా ఉంటాయని కోన హైస్కూల్ హెచ్‌ఎం చెంగల్‌రాయులు తెలిపారు. శుక్రవారం ఆయన పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులను పంపిణీ చేశారు.

## భూ టైటిల్‌ను రద్దు చేయాలి

ములకలచెరువు, జనవరి 19: రైతులను భూమికి దూరం చేసే విధంగా ఉన్న భూ టైటిల్ విధానాన్ని రద్దు చేయకుంటే పోరాటాలు చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు పేర్కొన్నారు. ములకలచెరువులో శుక్రవారం మండల సీపీఐ సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జగనన్న భూ సర్వే పేరుతో టైటిల్ లీడ్ జీవో నెంబర్ 27 తేవాలని చూస్తోందన్నారు. సమావేశంలో నియోజకవర్గ నాయకులు తోపు కృష్ణప్ప, మండల, పట్టణ కార్యదర్శులు అంజనప్ప, ఆనంద్, నాయకులు వేమనారాయణ, ఉత్తన్న, భాస్కర, రమణ, వెంకటరమణ, జయశేఖర్, నరసింహులు, రామకృష్ణ, రామప్ప, గంగులప్ప పాల్గొన్నారు.

## సంక్రాంతి సంబరాలకు సహకరించిన వారికి సన్మానం

మదనపల్లె టౌన్, జనవరి 19: మదనపల్లె పట్టణంలో ఈనెల 12న నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాలకు సహకరించిన పుర ప్రముఖులు, విద్యాసంస్థల అధినేతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు ఆర్డీవో మురళి ప్రశంసాపత్రాలు అందించి సన్మానించారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆర్డీవో మురళి మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు అవగాహన కల్పించేందుకు సంక్రాంతి సంబరాలు విజయవంతంగా నిర్వహించారన్నారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలి



నిరసన తెలియజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

మదనపల్లె అర్బన్, జనవరి 19: ఉద్యోగుల, ఉపాధ్యాయుల, కార్మి కులకు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నల్లరిబ్బన్లు ధరించి నిరసన తెలుపుతూ దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల పిల్లల భవిష్యత్ కోసం పొదుపు చేసుకున్న వేలాది కోట్ల రూపాయలను ఏళ్ల తరబడి విడుదల చేయకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదురుకొంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, ఉపాధ్యక్షురాలు హేమలత, జిల్లా కార్యదర్శులు పురంవెంకటరమణ, భాస్కర్‌రెడ్డి, ఆదినారాయణ, డివిజన్ కన్వీనర్ ఎంగవీటి సుధాకర్, రవిప్రకాష్, రెహ్మాన్, బివిరమణ, నాయకులు శ్రీనివాసులు, అంజాద్, గంగులప్ప, సీనప్పా, సురేంద్ర, శ్రీలత, భార్గవి,వెంకటయ్య, ఉత్తన్న రవీంద్ర, వెంకటరమణారెడ్డి, అజ్మతుల్లా, భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

**పీలేరులో:** ఉపాధ్యాయులకు ఉన్న బకాయిలు విడుదల చేయడంలో ప్రభుత్వ నాన్చివేత ధోరణిని వ్యతిరేకిస్తూ శుక్రవారం పీలేరులోని యూటీఎఫ్ నాయకులు తమ నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ ఏడాదిగా పీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్, డీఏ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తమ ఖాతాల్లో పీఎఫ్ సొమ్ము ఎంత ఉందో కూడా తెలియని గందరగోళ స్థితిలో రాష్ట్రంలోని ఉపాధ్యాయులు ఉన్నారని వాపోయారు. తమ డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించే వరకు తమ ఉద్యమాన్ని ఆపబోమన్నారు. కార్యక్రమంలో నాయకులు సదాశివరెడ్డి, చంద్రశేఖర్, రాధాకృష్ణ, రమేశ్‌రెడ్డి, వెంకటరమణ, దేవేందర్ రెడ్డి, విజయకుమార్, అనిరుద్రయ్య, నారాయణ నాయుడు, ఈశ్వరయ్య, జయరాం, సుధాకర్, రవికుమార్ పాల్గొన్నారు.

## ఆలయ పునర్నిర్మాణానికి దాతల విరాళం

గుర్రంకొండ, జనవరి 19:గుర్రంకొండ మండలం చెర్లోపల్లెలో కొలువైన రెడ్డెమ్మకొండ ఆలయ పునర్నిర్మాణానికి దాతలు విరాళం అందజేశారు. ఇందులో భాగంగా అన్నమయ్య జిల్లా సీటీఎంకు చెందిన దాత చింతల రెడ్డిశేఖర్‌రెడ్డి విరాళంగా రూ.55 వేలు నగదును ఇచ్చారు. ఈ మొత్తాన్ని ఆలయ ఈవో మంజులకు అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయాభివృద్ధికి వినియోగించాలని దాత అధికారులను కోరారు.

## 'రాజంపేట టీడీపీ ఎంపీ స్థానం వడ్డెరలకు కేటాయించాలి'

పెద్దమండ్యం, జనవరి 19: రాజంపేట టీడీపీ ఎంపీ స్థానం వడ్డెరలకు కేటాయించాలని రాష్ట్ర వడ్డెర్ల సంఘం మాజీ అధ్యక్షుడు నాగేశ్వరరావు రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడును కోరారు. శుక్రవారం పెద్దమండ్యం లో మండల వడ్డెర్ల సంఘం నాయకుడు మేకల చలపతి ఆధ్వర్యంలో రాష్ట్ర వడ్డెర్లల సంఘం మాజీ అధ్యక్షుడికి మద్దతుగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డెర్ల నాయకుడు అడుగు జాడల్లో నడుస్తామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం కోసం కృషి చేస్తామన్నారు. రాజంపేట పార్లమెంట్ పరిధిలో 2 లక్షల మంది వడ్డెర్లు ఉన్నారన్నారు. నాయకు లు సాంబ, శ్రీరాములు, మల్లికార్జున, మోహన, రెడ్డప్ప రవి పాల్గొన్నారు.

# అక్రమ ఓటర్ల జాబితాపై దృష్టి పెడదాం

● బీఎల్‌వోలు, వలంటీర్లపై ఒత్తిడి తెద్దాం

●జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు



మాట్లాడుతున్న జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు

మదనపల్లె, జనవరి 19: నియోజకవర్గంలో అక్రమంగా నమోదైన ఓటర్ల జాబితాపై దృష్టి పెట్టాలని మదనపల్లె జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు, పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక బర్మావీధిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జనసైనికులు, వీరమహిళలతో కలసి సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రం వారీగా ఓటర్ల జాబితా పరిశీలించి డబుల్ ఎంట్రీలు, చనిపోయిన, దొంగ ఓటర్లను, వలస ఓటర్లను గుర్తించి బీఎల్‌వోలు, వలంటీర్లతో కలసి సరిచూడాలన్నారు. మన పరిశీలనలో గుర్తించిన ఓటర్లను అధికారుల దృష్టికి తీసుకెళ్లి తొలగించేలా ఒత్తిడి చేయాలన్నారు. మదనపల్లెలో జనసేన చాలా బలంగా ఉందని, ఇదే పనితీరుతో అధినేత పవన్‌కళ్యాణ్ ఆదేశాల ప్రకారం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీనాయకులు దారం హరిప్రసాద్, కుప్పాల శంకర్, కోటకొండ చంద్రశేఖర్, వినయ్‌కుమార్‌రెడ్డి, షేక్ యాసిన్, సోను, సుప్రీంహర్ష, గంగాధర్, జాఫర్, రెడ్డి, గోపాల్, శేఖర్, బహదూర్, వీరమహిళలు రూప, లక్ష్మీదేవి, స్వర్ణ పాల్గొన్నారు.

## సమగ్ర ఓటర్ల జాబితా సిద్ధం చేసి ఇవ్వాలి



వాల్మీకిపురంలో విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

వాల్మీకిపురం, జనవరి 19: వాల్మీకిపురం మండల రెవెన్యూ అధికారులు తప్పులు లేని సమగ్ర ఓటరు జాబితా సిద్ధం చేసి ఇవ్వాలని మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి ఆయసన విలేకరులతో మాట్లాడుతూ గతంలో పలు మార్లు ఫిర్యాదు చేసినా ఓటరు జాబితాలో తప్పులు తొలగించడం లేదని ఆరోపించారు. ఓటర్ల జాబితాలో చనిపోయినవారు, డబుల్ ఎంట్రీలు, జీరో డోర్ నెంబర్లతో బయటి ప్రాంతాల ఓటర్లు తదితరం అలాగే ఉన్నాయని వాటిపై అధికారులు దృష్టి సారించని పక్షంలో ఎన్నికల సంఘం చర్యలకు బాధ్యులు కాక తప్పదన్నారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, నాయకులు కోసూరి చంద్రమౌళి, గాంధీపేట రెడ్డి, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత జగన్‌కు లేదు



అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

మదనపల్లె టౌన్, జనవరి 19: వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో వేలాది మంది దళితులపై దాడులు, అక్రమ కేసులు బనాయించారని అటువంటి జగన్‌కు విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత లేదని టీడీపీ ఎస్సీ, బీసీ, మైనారిటీ నాయకులు ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక ఎస్‌బీఐ ఎక్స్‌టెన్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ సూచనలతో టీడీపీ దళిత, బీసీ నాయకులు నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశా రు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కోడికత్తి శ్రీను నుంచి దళితుడైన డాక్టర్ సుధాకర్ వేలాది మంది టీడీపీ దళితులపై వైసీపీ నాయకులు దాడులు చేస్తున్నా జగన్ పట్టించు కోలేదన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో దళితుల ఓట్ల కోసమే ఈ డ్రామా ఆడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ, బీసీ నాయకులు మేకలరెడ్డి శేఖర్, పసుపులేటి శ్రీనివాసులు, ప్రభాకర్, ప్రకాష్, కాశీరామ్, గురుమూర్తి, సికిందర్, మేస్త్రీ శీనా తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే ధ్యేయంగా పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు అల్లాబక్ష

మదనపల్లె అర్బన్, జనవరి 19: రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించడమే ధ్యేయంగా పార్టీనాయకులు, కార్యకర్తలు పని చేయాలని పార్టీ జిల్లాఅధ్యక్షుడు అల్లాబక్ష పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో సమావేశం మదనపల్లె నియోజకవర్గ నాయకుడు రెడ్డిసాహెబ్ ఆధ్వర్యంలో నిర్వ హించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో త్వరలో నిర్వహించే న్యాయపోరాటం పాదయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అల్లాబక్ష మాట్లాడుతూ రాహుల్‌గాంధీ. న్యాయ పోరాట పాదయాత్రకు సంఘీభావంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి బెంగళూరు బస్టాండ్ వరకు నాయకులు ర్యాలీ నిర్వహించారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేడడానికి కృషి చేస్తున్నట్లు వారు తెలిపారు. 2024లో కేంద్రంలో రాహుల్‌గాంధీని ప్రధానమంత్రి చేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు నడుము బిగించి శ్రమించాలని కోరారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా పోటీలు నిర్వహించి యువతను, పిల్లలను ఉత్సాహపరుస్తూ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. అనంతరం 60మందికి పైగా కార్యకర్తలు పార్టీలోకి చేరినట్లు నేతలు ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్రమహిళా, జిల్లా ఉపాధ్యక్షురాలు మీనాకుమారి, జిల్లాప్రధాన కార్యదర్శి వెంకటరమణ, రాష్ట్రమైనార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కేబాషా, జిల్లాకార్యదర్శి చలపతి, మదనపల్లె రూరల్‌అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, నాయకు లు సుదీర్‌కుమార్, సోముశేఖర్, రవి, శరత్‌కుమార్‌రెడ్డి, ఖాసీం, మహబూబ్‌పీర్, రాజ శేఖర్‌నాయక్, మంజునాథ్, నరేష్, పాలేటి, ఈశ్వరమ్మ, ఐసక్, తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా కులగణన నమోదు చేయాలి



సర్పంచ్ దీప చేత బయోమెట్రిక్ తీసుకుని కులగణన మొదలు పెట్టిన అధికారులు

మదనపల్లె టౌన్, జనవరి 19:పారదర్శకంగా కులగణన నమోదు చేయాలని సర్పంచ్‌లు సూచించారు.మదనపల్లె మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఎంపీడీవో భానుప్రసాద్ ఆధ్వర్యంలో కులగణన నమోదు పారంభమైంది. శుక్రవారం మండలంలోని తట్టివారిపల్లె, కురవంక, బొమ్మనచెరువు పంచాయతీలో సర్పంచ్‌లు సిద్దల దీప, చిప్పిలి చలపతి, దండు కరుణాకర్‌రెడ్డి సమక్షంలో బయోమెట్రిక్ వేసి కులగణన నమోదు ప్రక్రియ మొదలు పెట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రెవెన్యూశాఖ నుంచి ఏఎస్‌వో, ఆర్ఐ, వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు ఈ కులగణనలో పాల్గొంటారన్నారు. ఈనెల 28వ తేదీ వరకు మండలంలో కులగణన నిర్వహిస్తారని, ఇందులో తప్పిపోయిన కుటుంబీకులకు ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 2 వరకు కులగణన నిర్వహిస్తామన్నారు. ప్రజలు కులగణనకు సహకరించాలని ఆయన కోరారు.



కులగణన సర్వేను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

**నిమ్మనపల్లిలో:** మండలంలో పక్కాగా కులగణన సర్వే చేపట్టాలని ఎంపీడీవో శేషాద్రి పేర్కొన్నారు. శుక్రవారం పది పంచాయతీల్లో కులగణన సర్వే ప్రారంభమైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన రెడ్డివారిపల్లి పంచాయతిలో జరుగుతున్న సర్వేను తనిఖీ చేసి కులగణన సర్వే ఈ నెల 19నుంచి 28వరకు జరుగుతుందని ప్రజలు అందరూ తప్పనిసరిగా సర్వే చేసుకోవాలన్నారు. పది రోజుల పాటు సర్వే నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శులు మారెప్ప, యర్రమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## కన్యాకుమారి నుంచి కాశ్మీర్ దాకా సైకిల్ యాత్ర



మహదేవ్‌బాబా

కలకడ, జనవరి 19:దేశంలోని 12 ప్రసిద్ధ శివలింగాలకు గంగా జలంతో అభిషేకం చేసేందుకు కన్యాకుమారి నుంచి కాశ్మీర్ దాకా సైకిల్ యాత్ర చేస్తున్నట్లు ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహదేవ్‌బాబా, అమరేంద్రలు తెలిపారు. స్వరాష్ట్రంలోని కాశీ నుంచి గంగా జలాలు సేకరించినట్లు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అక్కడ నుంచి కన్యాకుమారికి వెళ్లి యాత్రను ప్రారంభించినట్లు తెలిపారు. తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరంలోని సేలంలోని శివాలయాలను సందర్శించినట్లు తెలిపారు. ఈ మార్గంలో శ్రీశైలంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయానికి వెళుతునట్లు తెలిపారు. అక్కడు నుంచి మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయని, ఉత్తరఖాండ్‌లోని బద్రీనాథ్, కేథార్‌నాథ్, గంగోత్రి, యమునోత్రి క్షేత్రాల దర్శనంతో యాత్ర ముగుస్తుందన్నారు. పరమశివుడిపై ఉన్న భక్తిభావంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు.

## దోమల నివారణపై అవగాహన కల్పించండి

కలకడ, జనవరి 19:గ్రామాల్లోని ప్రజలకు దోమల నివారణపై అవగాహన కల్పించాలని జిల్లా మలేరియాధికారి వేణుగోపాల్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన ఎర్రకోటపల్లె ఆసుపత్రిని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా లార్వా సర్వేను నమోదు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం పాపిరెడ్డిగారి పల్లెలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని పరిశీలించారు. డాక్టర్ జవహర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.